

సోమశిలలో 18.072 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 25: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 18.072 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

కాగ్ ఆక్షేపించినా డోంట్‌కేర్ !

- 8 ఏళ్ల క్రితం రూ.25 కోట్లతో ఆత్మకూరు-సోమశిల రోడ్డు పనులు
- నాణ్యతపై ఫిర్యాదుల వెల్లువ.. విచారించిన సీఈ
- పనుల తిరస్కరణ.. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.8 కోట్ల రికవరీకి ఆదేశం
- ఏడేళ్లు గడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం
- ఫైల్‌ను తొక్కిపెట్టి, బీజీని రెన్యువల్ చేస్తున్న వైనం
- మళ్లీ టెండర్ పిలిచేందుకు సన్నాహాలు



తారు లేచిపోయి మట్టి రోడ్డులా మారిన ఆత్మకూరు-సోమశిల రోడ్డు

ప్రజాధనం అంటే ఆర్‌అండ్‌బీ అధికారులకు లెక్కే లేకుండా పోయింది. రోడ్డును నాణ్యత లేకుండా వేస్తున్నారని, ఇది పనికిరాదని, కాంట్రాక్టర్ నుంచి నగదు రికవరీ చేయాలని చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఆదేశించి ఏడేళ్లవుతున్నా ఇంతవరకు ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. పైగా ఏటా బ్యాంక్ గ్యారెంటీ(బీజీ)లు రెన్యువల్ చేస్తూ కాంట్రాక్టర్‌కు ఇబ్బంది లేకుండా కాపాడుతున్నారు. అదే సమయంలో వర్కు క్లోజ్ చేయకుండానే పలుమార్లు టెండర్లు పిలిచి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. గతేడాది కాగ్ ఆక్షేపించినా లెక్కచేయని అధికారులు బీజీ రెన్యువల్ చేయడంతోపాటు తాజాగా మరోమారు ఆత్మకూరు-సోమశిల రోడ్డు నిర్వహణకు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నాణ్యత లేకుండా వర్కు చేసిన కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసి ఆ నగదుతో మళ్లీ రోడ్డును బాగు చేయాల్సిన అధికారులు, ఆ బాధ్యత మరిచి మళ్లీ ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ ఖజానాకు తీవ్ర నష్టం చేస్తున్నారు.

నెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి ఎనిమిదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. 17 కి.మీ నుంచి 40 కి.మీ వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో రోడ్డు నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందడంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారించి పనుల్లో నాణ్యత లేదని నిర్ధారించి, వర్కునే రిజెక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించిన సుమారు రూ.8 కోట్ల బిల్లులను రికవరీ చేయాల్సిందిగా సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫార్సు చేశారు. ఇప్పటికి ఏడేళ్లు గడుస్తున్నా ఆ ఫైల్ బయటకు రాకుండా తొక్కిపెట్టారు. ఈ విషయానికి సంబంధించిన వివరాలు కోరినా ఆర్‌అండ్‌బీ అధికారులు దాటవేత ధోరణిలో వ్యవహరిస్తుండటం గమనార్హం.

కాగ్ ఆక్షేపణ

గతేడాది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధికారులు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఆత్మకూరు-సోమశిల రోడ్డు రిజెక్ట్ వర్కును కూడా ఆడిటింగ్ చేశారు. దీనిపై సదరు అధికారులు విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంట్రాక్టర్ నుంచి ఎందుకు రికవరీ చేయలేదు? వర్కును ఎందుకు క్లోజ్ చేయలేదు? క్లోజ్ చేయకుండానే మళ్లీ టెండర్లు ఎలా పిలిచారు? వంటి అనేక ప్రశ్నలు వేయగా అధికారుల నుంచి సమాధానాలు లేవు. ఈ వ్యవహారంపై ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి వివరణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. దాదాపు రూ.8 కోట్ల ప్రజాధనానికి సంబంధించిన విషయం అయినప్పటికీ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో కనీస మరమ్మతులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇటువంటి సమయంలోనైనా సదరు కాంట్రాక్టర్ నుంచి బిల్లులు రికవరీ చేస్తే దారుణంగా తయారైన ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు కనీసం ప్యాచ్‌లు అయినా వేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

తప్పు మీద తప్పు

సాధారణంగా ఒక వర్కుకు టెండర్ వేసేటప్పుడు బీజీ అందజేయాల్సి ఉంటుంది. సదరు కాంట్రాక్టర్ వర్కును పూర్తి చేసి నిర్వహణ పీరియడ్ కూడా ముగిశాక సదరు బీజీను అధికారులు తిరిగి ఇచ్చేస్తారు. సాధారణంగా నిర్వహణ పీరియడ్ రెండేళ్లు ఉంటుంది. అప్పటితో ఆ వర్కు ముగిసినట్లవుతుంది. ఆ తర్వాత గానీ ఆ రోడ్డును మళ్లీ అభివృద్ధి చేయడం గానీ లేక నిర్వహణ చేయడానికి గానీ టెండర్లు పిలవడం సాధ్యపడదు. కానీ ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు విషయంలో ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు నాణ్యత లోపంగా పనులు చేసిన కాంట్రాక్టర్ బీజీను ప్రతి ఏటా రెన్యువల్ చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కూడా సుమారు రూ.55 లక్షల బీజీలను ఠంచనుగా రెన్యువల్ చేసి ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో పైనుంచి కింది స్థాయి వరకు భారీగానే చేతులు తడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది కాగ్ ఆక్షేపణ చేసిన తర్వాత కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ బీజీ రెన్యువల్ చేయడం గమనార్హం. మరో విచిత్రమేమిటంటే ఈ వర్కును క్లోజ్ చేయకుండానే ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు ఈ ఏడేళ్ల కాలంలో పలుమార్లు టెండర్లు పిలిచారు. ఇప్పుడు మళ్లీ ఆ రోడ్డు దారుణంగా మారిపోయింది. దీంతో మరోమారు మెయింటెనెన్స్ కింద సుమారు రూ.50 లక్షలతో టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా అధికారులు తప్పు మీద తప్పులు చేసుకుంటూ వెళుతున్నారు. ఇప్పటికే మెయింటెనెన్స్ కోసం సుమారు రూ.10 కోట్లతో గత నెలలో టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ కూడా రాకపోవడం గమనార్హం. వర్కు క్లోజ్ కాకుండా మరో వర్కుకు అనుమతులు ఎలా ఇస్తారని ఆర్‌అండ్ చీఫ్ ఇంజనీర్ నయీముల్లాను వివరణ కోరగా వర్కు క్లోజ్ కాని విషయం తనకు తెలియదని చెప్పారు. కనుక్కుంటానని ఆయన సమాధానమిచ్చారు.



నెల్లూరు : అరుణాచలంవీధిలోని పాఠశాలను పరిశీలించి ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- 20,133 మంది అభ్యర్థుల హాజరు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 25: ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలోని 80 కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరిగింది. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డును చూపిన తరువాతే పరీక్ష హాల్లోకి అనుమతించారు. 23,908 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 20,133 మంది పరీక్షకు హాజరయ్యారు. 3,775 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 84.21గా ఉంది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం 0861-2331261 నంబరుతో కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూట్ అధికారులు, సిటింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగేలా చూశారు.

ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలన

నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ ఆదివారం పరిశీలించారు. నగరంలోని పప్పులవీధి మున్సిపల్ హైస్కూల్, తడికల బజార్‌లోని ఆర్ఎస్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్, అరుణాచలంవీధిలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, నవాబుపేటలోని బీవీఎస్ బాలికల హైస్కూల్‌లను ఆయన పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లపై అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్షలు ముగిశాయన్నారు.



నెల్లూరు : మద్రాసు బస్టాండ్ సమీపంలోని వీఆర్ ఐపీఎస్ సెంటర్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బస్సుల కోసం నిరీక్షణ ● **తప్పని చిల్లర కష్టాలు**

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గ్రూపు-2 పరీక్ష రాసేందుకు ఆదివారం ఉదయం వారి వారి ఇళ్ల నుంచి అభ్యర్థులు బయలుదేరారు. పరీక్ష కేంద్రాలు దూరంగా ఉండటంతో వేలాదిమంది అభ్యర్థులు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. సాధారణ ప్రయాణికులతో పాటు పరీక్షరాసే అభ్యర్థులు కూడా ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకోవడంతో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రయాణ కష్టాలు తప్పలేదు. విజయవాడ, తిరుపతి ప్రాంతాల వైపు వెళ్లే బస్సుల్లో సింగల్ డ్రైవర్ మాత్రమే ఉండటం, అభ్యర్థులు ఆ బస్సులు ఎక్కడంతో టికెట్లు ఇవ్వడం కష్టంగా మారింది. చాలా సమయం టికెట్లు ఇచ్చేందుకే పట్టడంతో అభ్యర్థులు పరీక్షకు సమయం దాటిపోతున్నదని ఆందోళన చెందుతూ డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. అలాగే చిల్లర కష్టాలు కూడా వారికి చుక్కలు చూపించాయి. బస్సుల్లోని డ్రైవర్లు, చిల్లర కావాలనడం, ఆన్‌లైన్‌లో పేమెంట్‌లు చేస్తామంటే సిగ్నల్స్ పనిచేయడం లేదనడం, చిల్లర తెచ్చుకోవాలని తెలియదా, చిల్లరు మళ్లీ ఇస్తాం.. టికెట్టు వెనుక రాస్తాం... అంటూ అభ్యర్థులను డ్రైవర్లు విసుక్కోవడం కనిపించింది. దీంతో వారు బాగా ఇబ్బందులు పడ్డారు.



పరీక్షకు వెళ్లేందుకు రద్దీగా ఉన్న బస్సు ఎక్కుతున్న అభ్యర్థులు

పటిష్ట బందోబస్తు

గ్రూపు-2 పరీక్ష కేంద్రాల పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ సిహెచ్ సౌజన్య నెల్లూరు నగరంలోని సర్వోదయ, నారాయణ, వీఆర్ ఐపీఎస్, ఆల్‌హందా పాలిటెక్నిక్ తదితర కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

వైసీపీ అభ్యర్థిత్వంపై సస్పెన్స్

- ఇన్‌చార్జిని ప్రకటించి పది రోజులైనా ముఖం చూపని వైనం
- పోటీకి అరవింద విముఖత ? ● కందుకూరులో మారుతున్న సమీకరణలు



అరవింద

కందుకూరు, ఫిబ్రవరి 25: కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య కుమార్తె కఠారి అరవిందను నియమించి పదిరోజులైంది. అయినా ఇంతవరకు ఆమె కందుకూరులో అడుగుపెట్టలేదు. ఆమె పోటీకి విముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసుకుని ఇక్కడ సీనియర్ నేత, సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి సహకారం లేకుండా నెగ్గుకురావటం అసాధ్యమన్న అభిప్రాయానికి ఆమె వచ్చినట్లు సమాచారం. తనకు ఆసక్తి ఉన్నప్పటికీ అరవిందను అత్తింటివారు ఎట్టిపరిస్థితుల్లో పోటీచేయటానికి లేదని దృఢమైన నిర్ణయంతో ఉన్నారని, దీంతో పునరాలోచనలో పడ్డామని, జగన్ తనకు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నానని వంకి పెంచలయ్య సన్నిహితులతో అన్నట్లు తెలిసింది. పెంచలయ్య మాటలను బట్టి ఇక అరవింద కందుకూరు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోటానికి సుముఖంగా లేరన్న విషయం స్పష్టమవుతోంది. పెంచలయ్యకు అవకాశం ఇచ్చే ఆలోచన జగన్‌కు ఉంటే ముందే ఆయనకే ఇన్‌చార్జి ఇచ్చేవాడని, ఆయనకు ఇచ్చే ఉద్దేశం లేనందునే అర విందకు అవకాశం ఇచ్చాడని కూడా విశ్లేషకులు అంటున్నారు.

టీడీపీ అభ్యర్థి ఎంపికపై ప్రభావం

ఈ పరిస్థితులన్నీ టీడీపీ అభ్యర్థి ఎంపికపైన తీవ్ర ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి అడుగులు ఎటువైపు అన్నవిషయాన్ని టీడీపీ ఆసక్తిగా గమనిస్తున్నది. ఆయన విషయంలో స్పష్టత వచ్చాకే ఇక్కడ అభ్యర్థిని టీడీపీ ఎంపిక చేస్తుందని భావిస్తున్నారు. ఇక ఆయనే టీడీపీలో చేరే అవకాశం ఉందని, అది జరిగితే ఆయనే అభ్యర్థి అవుతాడన్న వార్తలు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. తనపేరు తొలిజాబి తాలో కాకున్నా మలి,తుది జాబితాలోనైనా ఉంటుం దని భావిస్తూ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టికెట్ రేసులో ఉన్న యువనేత ఇంటూరి రాజేష్ కూడా అధిష్ఠానం వద్ద తన ప్రయత్నాలు ముమ్మరం చేశా రు. మరోవైపు టికెట్ రేసులో ఉన్న కోటపాటి జనార్దన్ కూడా ఆదివారం కందుకూరుకి వచ్చి సన్నిహితులతో సమావేశమయ్యారు. టికెట్ తనకే వస్తుందన్న ఆశాభావంతో ఉన్నానని, పదిరోజు లనాటి పరిస్థితులతో పోలిస్తే అవకా శాలు మెండుగా ఉన్నాయని, పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని అనుచరులను కోరినట్లు తెలిసింది.

అదిగో వస్తున్నాం... ఇదిగో వస్తున్నాం...

నాలుగు రోజులుగా పెంచలయ్య, అరవిందలు కందుకూరు వస్తున్నారని ప్రచారం జరుగుతూ ఉంది. శనివారం ఉదయం వారు కందుకూరు వచ్చి ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకుని ఆతర్వాత ఎమ్మెల్సీ మాధవరావును కలుస్తారని, అనంతరం మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని కార్యక్రమాలు ప్రారంభిస్తారని వైసీపీలోని కొందరు ముఖ్యనేతలు ప్రచారం చేశారు. అయితే ఇవేమీ జరగ్గపోగా శనివారం సాయంత్రం నెల్లూరులో విజయసాయిరెడ్డి నిర్వహించిన కీలక సమావేశా నికి కూడా అరవింద హాజరుకాలేదు. సమావేశం ప్రారంభమయ్యాక చాలాసేపటికి పెంచలయ్య వెళ్లి మొక్కుబడిగా కూర్చుని వచ్చారు. అయితే ఈ సమావేశానికి సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా డుమ్మా కొట్టారు. ఇకపోతే ఆదివారం కూడా పెంచలయ్య వస్తున్నాడని కొందరు ప్రచారం చేశారు. అయితే కొద్దిసేపటికే అనివార్య కారణాలతో కార్య క్రమం వాయిదా పడిందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అరవిందకు ఫోన్ చేయగా, ఆమె ఫోన్ తీయనందున అసహనం వ్యక్తం చేస్తూ హైదరా బాద్ వెళ్లినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా వ్యక్తిగత పనుల కారణంగా నాలుగురోజులు స్థానికంగా ఉండటంలేదని విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో అసలు వైసీపీకి అభ్యర్థి ఎవరు ? అనేది కేడర్‌ను గందరగోళంలో పడేసింది.

అందని అల్పాహారం

- అర్ధాకలితో చదువులు
- 'పది' విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ప్రభుత్వం



సంగం మండలం తరుణవాయి జడ్పీ పాఠశాలలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన అల్పాహారం తింటున్న టెన్త్ విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25: 'విద్యార్థి వృద్ధికి పెద్దపీట వేస్తున్నాం.. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పరీక్షల సమయంలో పౌష్టికాహారం అందిస్తున్నాం' అని గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఈ ఏడాది పదోతరగతి విద్యార్థులు అరకొర ఆహారంతోనే చదువులు కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కపూట మాత్రమే ఇంటి నుంచి తెచ్చుకునే ఆహారం తినడం మినహా వారికి ప్రభుత్వం ఎలాంటి పౌష్టికాహారం అందించడంలేదు. దీంతో అర్ధాకలితో, అలసిన శరీరాలతో తమ పిల్లలు పది పరీక్షలకు సన్నద్ధమవుతుండడం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారం ఊసేలేదు...

తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడంపై దృష్టి సారించే విద్యార్థులకు సరైన పౌష్టికాహారాన్ని సమయానికి అందించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వ పాఠశాలపై ఉంది. గత ప్రభుత్వాలు చొరవ తీసుకుని విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించేవి. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆదిశగా చర్యలు తీసుకోలేదు. ఉదయం 8 గంటలకే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సాయంత్రం 6 గంటల వరకు అక్కడే ఉంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం గంట ముందుగానే ఇళ్ల వద్ద బయలుదేరి, సాయంత్రం పాఠశాలల వదిలిన గంట తరువాత ఇళ్లకు చేరుకుంటారు. అప్పటివరకు ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న మధ్యాహ్న భోజనం మినహా విద్యార్థులకు ఎలాంటి పౌష్టికాహారం అందడంలేదు. ప్రభుత్వం మాత్రం ఉదయం విద్యార్థులకు రాగిజావ ఇవ్వడంతోపాటు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెపుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అత్యధిక పాఠశాలల్లో రాగిజావ ఇవ్వకపోగా, ఎక్కువమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినకుండా ఇళ్లవద్ద నుంచి తెచ్చుకున్న ఆహారాన్నే తింటున్నారు. దీంతో పేదవిద్యార్థులు ఆకలితోనే తమ చదువులు కొనసాగుతున్నారు.

వేలాదిమంది ఇబ్బందులు

జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ, మున్సిపాలిటీ, కేజీబీవీ పాఠశాలలు కలిపి మొత్తం 285 పాఠశాలల్లో ఈ ఏడాది 13,746 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరో 22రోజుల్లో (మార్చి 18 నుంచి) పరీక్షలు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తరగతులతో పాటు పురోగామి కార్యక్రమాన్ని కూడా ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు, రోజువారీ పరీక్షలు, సిలబస్ రివిజన్ తదితర కార్యక్రమాల్లో నిమగ్న మవుతున్నారు. ఆ సమయంలో వీరు తమ ఆహారాన్ని కూడా పూర్తిగా తినలేని పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధికశాతం పేద విద్యార్థులే కావడంతో వీరికి ఉదయం, సాయంత్రం అల్పాహారం తెచ్చుకునే స్తోమత ఉండదు. ఉదయం పాఠశాలలకు వస్తే మధ్యాహ్న భోజనం వారికి నచ్చితే కొంతమంది అక్కడే తింటుండగా, అత్యధిక పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రం ఇంటి వద్ద నుంచి తెచ్చుకునే భోజనాన్ని తింటున్నారు. సాయంత్రం వరకు పాఠశాలల్లోనే ఉండి తిరిగి రాత్రికి ఇళ్లకు చేరుకుంటారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహించా లని చెప్పినా అత్యధిక పాఠశాలల్లో సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో అయితే సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులే తమ సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది కానీ, పేద విద్యార్థుల ఆకలిని మాత్రం పట్టించు కోలేదని, పౌష్టికా హారానికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదని ఉపాధ్యాయులు అంటున్నారు.



నెల్లూరు బీవీనగర్ కేఎన్ఆర్ పాఠశాలలో స్టడీ అవర్‌లో టెన్త్ విద్యార్థులు

పట్టించుకోని ప్రభుత్వం

గత ప్రభుత్వాలు పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జడ్పీ నిధులను ప్రత్యేకంగా కేటాయించేవి. అయితే ఈ ప్రభుత్వం మాత్రం కొన్నేళ్లుగా విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మాత్రం జడ్పీ సమావేశంలో మంత్రితో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు అందరి సమక్షంలో టెన్త్ విద్యార్థుల ఉన్నతికి తామెంతో కృషి చేస్తున్నామని, ఫలితాల్లో అగ్రస్థానంలో జిల్లాను నిలబెడతామని, ప్రతిరోజూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేస్తామని ప్రకటించారు. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి విద్యార్థులకు అల్పాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొన్నిచోట్ల అందచేస్తున్నాం...

ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులు దాతల సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇది అమలవుతుండగా, మిగిలిన పాఠశాలల్లో కూడా ఆ దిశగా చర్యలు చేపట్టమని సిబ్బందికి సూచించాం. ఈ విషయమై సంబంధిత డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

- పీవీజే రామారావు, డీఈవో

జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

- నిర్మాణానికి రూ.16.63 కోట్లు
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- రోగులు సద్వినియోగం చేసుకోవాలి : జడ్పీ చైర్‌పర్సన్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్, డీఎంహెచ్‌వో పెంచలయ్య తదితరులు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 25 : నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) ప్రాంగణంలో నిర్మించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి ప్రధాని ఈ భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తూ జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ భవనాన్ని త్వరగా పూర్తిచేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జ్ కలెక్టర్ వికాస్ మర్మత్ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, వికసిత భారత్‌లో భాగంగా అనేకచోట్ల వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులతో ఈ బ్లాక్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ 50 పడకలతో కూడిన ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం వల్ల ఆధునిక వైద్యపరికరాలతోపాటు వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారన్నారు. పేదలు దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మంచి వైద్యం అందుతుందని చెప్పారు. రూ. 16.63 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. వైద్య పరికరాలకు రూ. 7.12 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన చికెన్ అంగళ్లు

- పెరిగిన మటన్, చేపల ధరలు



జనాలు లేక అనంతసాగరంలో బోసిపోయిన చికెన్ దుకాణం

అనంతసాగరం, ఫిబ్రవరి 25: ప్రతివారం కొనుగోలుదారులతో ఎంతో సందడిగా ఉండే చికెన్ దుకాణాలు ఆదివారం వెలవెలబోయాయి. కొన్ని రోజులుగా బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందుతున్న క్రమంలో జిల్లా వ్యాప్తంగా పౌల్ట్రీ వ్యాపారం తగ్గింది. మాసం ప్రియులు చికెన్‌కు దూరంగా ఉంటున్నారు. ఆదివారం ఒక్కరోజే మండల ప్రాంతాల్లో ఒక్కో అంగట్లో 40 నుంచి 100 కేజీల చికెన్ విక్రయం జరిగేది. ప్రస్తుతం పది కేజీల కూడా అమ్ముడుపోవడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది లా ఉంటే చికెన్ వ్యాపారం లేకున్న ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలో స్కిన్‌లెస్ రూ.300లు పలుకుతోంది. సహజంగా వ్యాపారం లేనపేపుడు ధర తగ్గాలి కానీ చికెన్ వ్యాపారంలో భిన్నపరిస్థితి కనిపిస్తోంది. ఒక వైపు చికెన్‌కు గిరాకీ తగ్గిన వేళ చేపలు, మటన్‌కు డిమాండ్ పెరగడంతో వాటి ధరలు పెరిగాయి. మొన్నటికి వరకు గ్రామీణ ప్రాంతంలో కేజీ మటన్ రూ.750 పలుకుతుండగా నేడు రూ.850కు అలాగే చేపలు కేజీ రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.150కు చేరుకున్నాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

సర్వేనే చేయలేదు.. హద్దురాళ్లు తెచ్చారు!

- రికార్డులు లేక నిలిచిపోయిన భూముల రీసర్వే
- ఆశ్చర్యపోతున్న రైతులు



కనుపూరుపల్లి పంచాయతీలో రీసర్వే చేయాల్సిన భూములు

కలువాయి, ఫిబ్రవరి 25 : ఆలూలేదు.. చూలులేదు.. కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా ఉన్నది ప్రభుత్వ రీసర్వే తీరు. కలువాయి మండలం కనుపూరుపల్లి పంచాయతీలో భూముల రీసర్వే ఇంకా చేయలేదు. అయితే హద్దు రాళ్లు మాత్రం ఆరు నెలలు ముందు లారీలో తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేశారు. ఇది చూసిన రైతులు ఆశ్చర్యపోతున్నారు. ఇదంతా వారి కమీషన్ల కోసమేనని గుసగుసలాడుకొంటున్నారు. రీసర్వే కోసం ఏడాది క్రితం కనుపూరుపల్లి పంచాయతీని అధికారులు ఎంపిక చేశారు. అయితే, ఈ పంచాయతీలోని కనుపూరుపల్లి, వెరుబొట్లపల్లికి సంబంధించిన భూముల రికార్డులు లేవని సర్వే పనులు ప్రారంభించలేదు. ఈ గ్రామాలలో పట్టా భూములతోపాటు వేలాది ఎకరాలు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములు కూడా ఉన్నాయి. దీంతోపాటు తెలుగుగంగ కాలువ కింద కేశమనేనిపల్లి, చవటపల్లి వద్ద చేపట్టిన రిజర్వాయర్ల కోసం పట్టా భూములతోపాటు అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వం సేకరించింది. ఇవికాక సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల కోసం కూడా కొంత భూములు సేకరించారు. అయితే చవటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపులో అక్రమాలు జరగడంతో విచారణ కోసం తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు ఈ భూముల రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతో రికార్డులు లేక సర్వే చేయలేదని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం ఏడాది క్రితం రీ సర్వే కోసం తమ పంచాయతీని ఎంపిక చేసి ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరగా రీసర్వే చేపట్టాలని ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నారు.



కనుపూరుపల్లిలో రోడ్డుపక్కన గుట్టగా హద్దు రాళ్లు

రేపటి నుంచి టెట్

- మార్చి 6 వరకు నిర్వహణ
- నాలుగు పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 6,363 మంది అభ్యర్థులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు రంగం సిద్ధమైంది. జిల్లాలో మొత్తం 6,363 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతుండగా, వారికి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 6 వరకు నిర్వహించే ఈ పరీక్షకు అన్ని సన్నాహాలు చేపట్టడంతో పాటు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నెల్లూరు డివిజన్ వారికి ముత్తుకూరురోడ్డులోని గీతాంజలి పీజీ కళాశాల, జొన్నవాడ-నరసింహకొండ రోడ్డులోని ఇయాన్ డిజిటల్ జోన్, కావలి డివిజన్ అభ్యర్థులకు ఉదయగిరి రోడ్డులోని పీబీఆర్ విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, బోగోలు మండలం కడనూతలలోని ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. 9 రోజులపాటు జరిగే ఈ పరీక్షకు గీతాంజలిలో 1,451, ఇయాన్‌లో 2,882, విశ్వోదయలో 840, ఆర్‌ఎస్‌ఆర్‌లో 1200 మంది కలిపి మొత్తం 6,363 మంది హాజరుకానున్నారు. అభ్యర్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షను నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. సెల్ ఫోన్, బ్లూటూత్ తదితర పరికరాలను తీసుకెళ్లకూడదని అధికారులు సూచించారు. తనిఖీల్లో బయటపడితే పరీక్షకు అనుమతించబోమని వారు స్పష్టం చేశారు. ఈ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించేందుకు కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డీ మధుసూదన్‌రావును జిల్లా పరిశీలకుడిగా నియమించినట్లు డీఈవో రామారావు తెలిపారు.

ఆ ముగ్గురు ముద్దుబిడ్డలకే బిల్లులు !

- చిన్న కాంట్రాక్టర్లను రోడ్డున పడేసిన జగన్
- టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి



నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతున్న ఆనం వెంకట రమణారెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తనకు కావాల్సిన వ్యక్తులకే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బిల్లులు చెల్లిస్తున్నారు తప్ప, న్యాయంగా పనులు చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూపాయి బిల్లు ఇవ్వకుండా ముంచేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. ఆఖరుకు వైసీపీ కార్యకర్తలు పనులు చేస్తే వారికి కూడా బిల్లులు ఇవ్వకుండా రోడ్డున పడేశారని ఆయన దుయ్యబట్టారు. ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది కాంట్రాక్టర్లు ఉండగా, వారిలో గడిచిన ఐదేళ్లలో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంకా చాలా మంది ఐపీ పెట్టి రోడ్డు మీద పడ్డారు. సుమారు నాలుగు లక్షలమంది కాంట్రాక్టర్లు జగన్మోహన్‌రెడ్డి మూలంగా ఆస్తులమ్ముకోవాల్సి వచ్చింది. జగన్మోహన్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలతోపాటు మరో ముగ్గురు ముద్దుబిడ్డలు కూడా ఉన్నారు. వారు ఎవరంటే పీఎల్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పీ మిథున్‌రెడ్డి, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటి శ్రీనివాసులురెడ్డి, షిరిడిసాయి విశ్వేశ్వరరెడ్డి. ఈ ముగ్గురు ముద్దుబిడ్డలకు మాత్రమే బిల్లులను మూడు నెలల్లోపే చెల్లించేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా మంది వైసీపీ కార్యకర్తలే పనులు చేశారు. వారంతా చితికిపోయారు. సిద్ధం, సిద్ధం అంటూ మాట్లాడే జగన్మోహన్‌రెడ్డి చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు సిద్ధమా..?. జగన్మోహన్‌రెడ్డి బిల్లులిచ్చే ప్రసక్తే లేదు. వైసీపీ కాంట్రాక్టర్లంతా కళ్లు తెరవాలి. మేము అధికారంలోకి వచ్చాక బిల్లుల చెల్లింపు జరిగిన విధానంపై విచారణ జరుపుతాం' అని ఆనం వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు.

జాబితా అద్భుతం

టీడీపీ-జనసేన అభ్యర్థుల ఉమ్మడి జాబితా అద్భుతంగా ఉందని ఆయన చెప్పారు. అయితే ఇప్పటికీ వైసీపీకి అభ్యర్థులను ప్రకటించే దమ్ములేదని ఎద్దేవా చేశారు. పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు కష్టపడి పైకొచ్చారని కానీ మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్ ఎలా ఎదిగారో చెప్పాలని ఆనం డిమాండ్ చేశారు. బీసీలకు టీడీపీ ఇచ్చిన ప్రాధాన్యత మరెవరూ ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, ఫిబ్రవరి 25: కావలి మండలం చెంచుగానిపాలెం సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై రూరల్ సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 3 పందెం కోళ్లు, రూ.2480 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కావలి రూరల్, ఫిబ్రవరి 25: కావలి పట్టణం నార్తుజనతాపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన శనివారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. న్యాయవాది శ్రీకాంత్‌కు నార్తుజనతాపేటతో పాటు ముసునూరు ఇందిరమ్మకాలనీలో ఇళ్లు ఉన్నాయి. దీంతో పగలంతా కోర్టు విధులకు వచ్చిన సమయంలో ఆయన నార్తుజనతాపేటలోని ఇంట్లో ఉంటారు. కుటుంబం అంతా ముసునూరు ఇందిరమ్మకాలనీలోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నార్తుజనతాపేటలోని ఇంటికి వచ్చిన ఆయన ఇంటికి వేసిన తాళం తీసి ఉండడాన్ని గుర్తించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన 5 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.35 వేలు, రాగిబిందె కనిపించలేదు. దీనితో దొంగలుపడి వాటిని అపహరించుకెళ్లారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రెండవ పట్టణ సీఐ కొండవీటి శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసరావులు నెల్లూరు క్లూస్ టీం బృందాన్ని పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5943
వెండి కిలో ధర	రూ. 72,100
వెండి ఒక గ్రాము	రూ. 74.10

వైసీపీకి ఇద్దరు నేతల రాజీనామా



మాట్లాడుతున్న ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి25: మండలంలో ఇద్దరు వైసీపీ నేతలు ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. వవ్వేరు బ్యాంకు చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చైర్మన్ పదవితోపాటు పార్టీకి రాజీనామా చేయగా, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు కూడా వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో బయట వ్యక్తుల పెత్తనాలు ఎక్కువకావడం, ఎమ్మెల్యే నిర్లక్ష్యంవల్ల ఇమడలేకనే పార్టీకి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. కాగా వైసీపీకి రాజీనామా చేసిన ఈ ఇద్దరు నేతలు మార్చి 2న టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు సమాచారం.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల విజేత నెల్లూరు జట్టు



విజేతలకు ట్రోఫి. నగదు అందజేస్తున్న ప్రసాద్‌రెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి 25: కావలి పట్టణంలోని డీఆర్ ప్రాంగణంలో కావలి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఫుట్‌బాల్ జిల్లాస్థాయి టోర్నమెంట్ విన్నర్‌గా నెల్లూరు ఏసీ స్టేడియం, రన్నర్‌గా నెల్లూరు కొత్తూరు, మూడవ స్థానంలో బిట్రగుంట జట్టు నిలిచాయి. టీడీపీ కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి దాతృత్వంతో విన్నర్‌కు రూ.20వేలు, రన్నర్‌కు రూ.10 వేలు, తృతీయ జట్టుకు రూ.5000 నగదు బహుమతులు, ట్రోపిలు అందజేశారు. చీఫ్ రెఫెరీగా నాయుడుపేటకు చెందిన గౌస్‌బాషా వ్యవహరించారు. బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా జేబీ పీడీ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఉమెన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ నవీద్, సీనియర్ క్రీడాకారులు బీ.విజయ్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ కలిగిన దమ్మున్న క్రీడ ఫుట్‌బాల్ అని, కావలిలో ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు తనవంతు సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నలందా పీఈటీ మనోజ్, జేబీ క్రీడాకారుడు శేషు, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి : సోమిరెడ్డి



బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 25: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమి రెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరులో ఆదివారం నిర్వహించిన ముగింపు ఉత్సవాల్లో రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ముత్తుకూరులో మినీ స్టేడియం నిర్మాణానికి స్థలం ఏర్పాటు చేయడంతోపాటు తాము నిధులను మంజూరుచేశామని, వైసీపీ ప్రభుత్వం కనీసం స్టేడియం నిర్మాణం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. మంత్రి కాకాణిని సర్వేపల్లి ప్రజలు ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ
- ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారోత్సవంలో ఆర్యవైశ్య నాయకులు

పొదలకూరు, ఫిబ్రవరి 25: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు సూచించారు. పొదలకూరు పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న చిన్ని రామ సత్యనారాయణ, జయంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు ఎవరైనా ఆర్థికంగా వెనుకబడి ఉంటే వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి సభాధ్యక్షుడిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు మొగళ్లూరు వెంకటశేషయ్య వ్యవహరించారు. రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా అమర్తలూరు చెంచయ్య, ప్రధాన కార్యదర్శిగా చందా వెంకటస్వామి, వర్కింగ్ సెక్రటరీగా పొట్టి సుధాకర్, రూరల్ ఆర్యవైశ్య సంఘం కోశాధికారిగా తెలన్నాకుల ఆదినారాయణ, రూరల్ ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షుడిగా రాజసురేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా రూరల్ యువజన ఆర్యవైశ్య సంఘం, జిల్లా మహిళా, పొదలకూరు మండల యువజన ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు రాజపూటి ధనుంజయరావు, జొన్నలగడ్డ బ్రహ్మయ్య, పొదలకూరు మండల ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు చిట్లూరు వెంకటసుబ్రహ్మణ్యం, జిల్లా మహిళా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న విజయలక్ష్మీ, ట్రెజరర్ అమరా సుప్రజ, రూరల్ యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజా సురేంద్రబాబు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తన్నీరు సురేష్‌బాబు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుర్రం మీరామధు, మండల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు పైడా కామేశ్వరరావు, చిన్నా పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఉపాధి హామీ గ్రామసభలు



అలగానిపాడులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు

విడవలూరు, ఫిబ్రవరి 25: మండలంలోని అన్నారెడ్డి పాలెం, అలగానిపాడు, ముదివర్తి గ్రామాలలో ఆదివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహించారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఉపాధి పనులకు సంబంధించి డ్రాయింగ్ అధికారులైన పంచాయతీ కార్యదర్శులు హాజరుకాకపోయినా గ్రామ సభలు నిర్వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లాధికారులు స్పందించి ఉపాధి హామీ పనులపై జరుగుతున్న సామాజిక తనిఖీలపై దృష్టిసారించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యకు గురైన వృద్ధురాలి దంతం లభ్యం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25: మండలంలోని రెడ్డిపాళెంలో వృద్ధురాలు గెడేసిన ఈశ్వరమ్మ (74) హత్య జరిగిన ఇంట్లో ఆదివారం మృతురాలికి చెందిన ఓ పన్ను (దంతం), ఇంట్లోని ఫ్రిజ్ కింద ఓ చిన్నపాటి రాయి బంధువులకు దొరికింది. ఈమేరకు వారు శనివారం రాత్రే సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి వాటిని సేకరించినట్టు తెలిసింది. మృతురాలి అంత్య క్రియల అనంతరం శనివారం ఇల్లు కడుగుతుండగా దుప్పటి విదిలించడంతో అందులోనుంచి ఓ పన్ను, పక్కనే ఫ్రిజ్ కింద ఓ మోస్తరు రాయి (గుండ్రాయి) బంధువులు గుర్తించి పోలీసులకు అందజేశారు.

28న టైలర్స్‌డే వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ కల్యాణ మండపంలో ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు టైలర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరుజిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఆ రోజు ఉదయం 10గంటలకు ట్రంకురోడ్డు, రెడ్డి టైలర్స్ సెంటర్‌లో టైలర్స్‌డే పతాక ఆవిష్కరణ జరుగుతుందని సంఘం నగర కార్యదర్శి పీ యానాదయ్య, జిల్లా కోశాధికారి ఎస్‌కే బాబు తెలిపారు.

20 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు.. నేడు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మార్చి 20 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆ ఉత్సవాల పనులు చేపట్టేందుకు సోమవారం ఉదయం 9.45గంటలకు గుంజ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

3న అక్షరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం): చిన్ని నారాయణరావు సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 3న అక్షరోత్సవం కార్యక్రమం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిన్ని నారాయణరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటలకు టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో జరుగుతుందన్నారు. ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, కవి సంగమ ఉద్యమ సారథి యాకూబ్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

సున్నా వడ్డీ హుళక్కేనా ?

- రెండేళ్లుగా ఖాతాలకు జమకాని నగదు
- రైతులను పట్టించుకోని ప్రభుత్వం
- లబోదిబోమంటున్న అన్నదాతలు

సంగం, ఫిబ్రవరి 25: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో కడితే సున్నా వడ్డీ చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, అది వారికి అందడం లేదు. దీంతో రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఆర్థిక దన్నుగా ఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయి. అలాంటిది 2022 నుంచి 2023 వరకు జిల్లాలో రుణాలు పొంది పంటలు సాగు చేసి తిరిగి సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ రావాల్సి ఉంది. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా రాకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అటు ఖరీఫ్‌లోనూ, ఇటు రబీలోనూ రైతులు ప్రతి ఏటా బ్యాంకులు, వ్యవసాయ పరపతి సహకారం సంఘాల (సొసైటీలు) ద్వారా రుణాలు తీసుకుంటారు. అప్పటి నుంచి వీరికి రాయితీ రాకపోవడంతో అప్పుల ఊబిలోకి ఇరుక్కుపోతున్నారు. అయినా ప్రభుత్వానికి ఏమీ పట్టడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే అధిక మొత్తంలో సాయం చేస్తామంటూ సీఎం జగన్ ప్రకటించారు. చివరకు రూ. లక్షకు కుదించారు. సున్నా వడ్డీ రాయితీకి సంబంధించి ఖరీఫ్, రబీకి రూ. కోట్లలో బకాయిలు రావాల్సి ఉంది.

యథావిధిగా కేంద్రం రాయితీ

రూ. లక్షలోపు పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు సున్నావడ్డీ మాఫీ వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీ కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద ఇస్తున్నారు. ఈ మేరకు సీజన్ ముగిసే సమయానికి ఇవి జమకావాలి, సున్నా వడ్డీ కింద రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీ చెల్లించాలి. అలానే రూ. 3లక్షలలోపు రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లిస్తే ప్రామ్ట్ రీపేమెంట్ సున్నావడ్డీ పేరుతో కేంద్రం 3శాతం నగదు జమచేయాలి. కేంద్రం యథావిధిగా అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సున్నా వడ్డీ జమ చేయడంలేదు.

రెండేళ్లుగా నిరీక్షణ

సున్నా వడ్డీ కోసం రైతులు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు. సున్నా వడ్డీపై వ్యవసాయాధికారులను ప్రశ్నించగా నివేదకలను ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో వడ్డీ రాయితీ వస్తుంది. అదిగో.. ఇదిగో అంటూ కబుర్లు చెబుతున్నారు. బ్యాంకులు మాత్రం వడ్డీతో కలిపి చెల్లిస్తేనే, మళ్లీ రుణాలు ఇస్తామని చెబుతున్నాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో వడ్డీతోసహా రుణాలు తిరిగి చెల్లించాం. కానీ రెండేళ్లయినా ఇంత వరకు జమ కాలేదని రైతులు వాపోతున్నారు.



బ్యాంకు రుణం తీసుకుని రైతు సాగు చేసిన వరిపైరు

సున్నా వడ్డీ రాయితీ అంద లేదు...



రెండేళ్లుగా బ్యాంకు నుంచి రుణం తెచ్చుకొని పంట సాగు చేసుకున్నా. పంట కోత పూర్తైన తరువాత రుణం సకాలంలో చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుందని చెల్లించా. రెండేళ్ల నుంచి నగదు జమ కాలేదు. ప్రభుత్వం రైతులను అసలు పట్టించుకోవడం లేదు.

- దొరబాబు, రైతు, కొరిమెర్ల

సున్నా వడ్డీ వెంటనే జమ చేయాలి



గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. ప్రభుత్వం నుంచి కౌలు రైతు కార్డు పొందా. ఈ కార్డు ద్వారా బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నా. సకాలంలో వడ్డీతో రుణం చెల్లిస్తే సున్నా వడ్డీని కింద ప్రభుత్వం జమ చేస్తుందని, తీసుకున్న రుణానికి వడ్డీతో కలిపి సకాలంలో చెల్లించా. రెండేళ్లయినా మంజూరు కాలేదు. ఇకనైనా ప్రభుత్వం సున్నా వడ్డీని వెంటనే విడుదల చేయాలి.

- రమణారెడ్డి, కౌలు రైతు, కండ్రిక

సాగునీరు వదలకపోతే ధర్నా చేస్తాం: బీజేపీ



షట్టర్ వద్ద అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

చేజర్ల, ఫిబ్రవరి 25: ఇరవైరోజులుగా సోమశిల దక్షిణ కాలువ ద్వారా పొదలకూరు మండలంలోని చెరువులకు నీటిని వదులుతున్నారు. అయితే చేజర్ల మండలంలోని గొల్లపల్లి, పాడేరు చెరువులు మాత్రం ఒక్కరోజు కూడా నీటిని వదలడంలేదని.. అడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు బత్తల కిష్టయ్య, కుంకు బాలయ్యలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేజర్ల మండలంలోని గొల్లపల్లి, పాడేరు చెరువులు కింద సుమారు రెండు వందల ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తున్నారు. అయితే పంట చేతికి రావటానికి ఇంకా రెండు నెలలు సమయం ఉన్నది. దక్షిణ కాలువ నుంచి ఆయా గ్రామాల చెరువులకు ఒక్కరోజు నీరు వదలాలని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు రైతులతో కలసి చేజర్ల తహసీల్దారుకు వినతిపత్రం అందజేశామన్నారు. అధికారులు మాత్రం కాలయాపన చేస్తున్నారో తప్ప నీటిని వదడం లేదు. దీనికి తోడు 24ఎల్ షట్టర్ వద్ద లీకేజీ అవుతున నీటిని కూడా రానీయకుండా ఇసుక బస్తాలు వేయించినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

24ఎల్ షట్టర్ పరిశీలన

ఆదివారం ఉదయం బీజేపీ మండల నాయకులు స్థానిక రైతులతో కలసి 24ఎల్ షట్టర్ వద్ద అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలించారు. పొదలకూరు మండలం వారే రైతులా... చేజర్ల మండలంలో ఉన్నవారు రైతులు కాదా.. అసలు ప్రజలు చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు రైతుల సమస్యలు పట్టవా అని వారు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రంలోగా నీరు వదలకపోతే జిల్లా నాయకులు, రైతులతో కలసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రామ నాయుడు, లాలి వెంకటయ్య పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి గడువు పెంపు



ప్రిన్సిపాల్ శైలజకుమారి

చేజర్ల, ఫిబ్రవరి 25: ఆదురుపల్లిలోని అంబేడ్కర్ బాల యోగి గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 28వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బి.శైలజకుమారి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి పూర్తి చేసినవారు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 10వ తరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఆన్‌లైన్ లేదా నేరుగా తమ పాఠశాలలో దరఖాస్తు ఇవ్వచ్చని సూచించారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25: గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ నాయకులు ముడమాల రమేష్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామగ్రామాన ప్రజలకు అవగాహన కల్పించి వారి చైతన్యం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న వర్గపోరు బీజేపీకి కలుస్తొందన్నారు.

శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సీతారామపురం , ఫిబ్రవరి 25: స్థానిక పడమటివీధిలోని శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా పరమశివుడు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పండితుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు కంకణదారులై కల్యాణంలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో విజయసంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్లు ఓబులరెడ్డి, వాసుదేవరెడ్డి, షేక్ అలీఅహ్మద్, ఉప సర్పంచ్ ముర్తుజా పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

కందుకూరు, ఫిబ్రవరి 25: మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని రాళ్లవీధిలో ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా వడ్లమూడి శేఖర్, ఉపాధ్యక్షులుగా మధుర మధు, మాధవరం వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా కొమ్మెర్ల విజయ్‌లను ఎన్నుకున్నారు. సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు వెంకటేశ్వర్లు, కృష్ణ, హరిబాబు, వీరనారాయణ, బ్రహ్మయ్య, పాపయ్య, చిన్న, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

లింగసముద్రం, ఫిబ్రవరి 25: మండలంలోని కొన్ని గ్రామాల్లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దీంతో పలువురు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం సమీపంలోని ఓ కాలనీలో, పెదపవనిలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వీరు గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి రూ.100 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. లింగసముద్రం, మొగిలిచెర్ల, శాయిపేట గ్రామాలకు చెందిన వారు ప్రతిరోజూ జంపాలవారిపాలెం వచ్చి గంజాయి తీసుకెళుతున్నట్లు తెలిసింది. పెదపవనిలో పాడుబడిన హైస్కూల్ భవనాల వద్ద కొందరు యువకులు నిత్యం గంజాయి పీలుస్తూ జోగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

సంగం, ఫిబ్రవరి 25: తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదివారం గ్రామ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ప్రింటర్, పదవ తరగతి విద్యార్థులకు పాడ్స్, పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు కోరిక మేరకు వీటిని అందచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చల్లా ప్రభాకర్ యాదవ్, డేగా విజయ్‌కుమార్ యాదవ్, వినయ్ కుమార్, మద్దెల సందీప్ ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

సంగం, ఫిబ్రవరి 25: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కృషి చేస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఐదో తరగతి విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపస్ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రోత్సహిస్తుందన్నారు. అందులో ముందున్న నెల్లూరు, సంగం ఆపస్ శాఖలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోతురాజు శిలలకు జీర్ణోద్ధరణ పూజలు



పూజలు చేస్తున్న వేద పండితులు

సంగం, ఫిబ్రవరి 25: తరుణవాయి నడిబొడ్డున ఉన్న పోతురాజు, సీతాలదేవి శిలలకు ఆదివారం జీర్ణోద్ధరణ పూజలు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా శిలలకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం పోతురాజు, సీతాలదేవి శిలలను ఎద్దల బండిపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వాటిని రామాలయంలో భద్రపరిచారు. నూతన మండపం నిర్మించిన అనంతరం తిరిగి ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్



విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీదు

అనంతసాగరం, ఫిబ్రవరి 25: అత్యంత పవిత్రమైన షబే బరాత్ వేడుకలను ముస్లిం సోదరులు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి జాగరం చేస్తూ నఫిల్ నమాజు చేశారు. షబే బరాత్ ప్రాముఖ్యతను వక్తలు వివరించారు.

ఉదయగిరి: సబ్ బరాత్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, ఉదయగిరి, బిజ్జంపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు ఖురాన్ బోధనలను వివరించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోదాం

బిట్రగుంట, ఫిబ్రవరి 25: బిట్రగుంట, కావలి రైల్వే స్టేషన్ల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి-152ను సోమవారం ప్రారంభించేందుకు వస్తున్న రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి పలు రైల్వే సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అందరూ కలసి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ కోరారు. బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సమస్యలు, బిట్రగుంటలోని ఎల్సీ గేట్-144తో స్థానికులు పడుతున్న అవస్థలను విన్నవించుకుందామన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, అభిమానులు, స్థానిక వ్యాపారులు తరలిరావాలని ఆయన కోరారు.

ఉద్యోగులపై ప్రభుత్వ మొండి వైఖరి తగదు



సమావేశంలో మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య

బిట్రగుంట, ఫిబ్రవరి 25: ఉద్యోగుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి తగదని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఎంపీపీ పాఠశాల్లో మండల బీటీఏ అధ్యక్షుడు ఆవుల కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతు కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, డీఏ, ఏపీజీఎల్ఐ బకాయిలను ఇంతవరకు చెల్లించలేదన్నారు. తక్షణం బకాయిలను విడుదల చేసి 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శులు టీ.రవి, సీహెచ్ సుదర్శన్, జీ.సత్యం, కే.కృష్ణప్రసాద్, సురేష్‌బాబు, కుదారి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



వాటర్ ప్లాంట్ వద్ద, వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అల్లూరు, ఫిబ్రవరి 25 : విద్యుత్ సరఫరాను నియంత్రించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. మండల కేంద్రమైన అల్లూరులో అక్కడక్కడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తగ్గిపోయి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. అల్లూరు వాటర్ ప్లాంట్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ఉండడంతో అక్కడ నిత్యం పశు సంచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా వేణుగోపాలస్వామి దేవాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. అదేవిధంగా ఆర్‌డీఆర్ కాలనీలో పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిని మరమ్మత్తులు చేపట్టి ప్రమాదం లేకుండా చూడాలని తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గురుకులంలో ప్రవేశానికి 28 వరకు గడువు పొడిగింపు

బిట్రగుంట, ఫిబ్రవరి 25: బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : కావ్య



టీడీపీలో చేరిన యువతతో కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 25: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గ్రహించిన యువత టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. 23వ వార్డు ఇన్‌చార్జి వర్థినేని వెంకటేశ్వర్లు నాయుడు, అంబటి క్రిషోర్, గోసు రవి, షేక్ షమీర్‌ల ఆధ్వర్యంలో పలువురు యువత ఆదివారం బైక్ ర్యాలీగా పట్టణంలోని ముసునూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కావ్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 27వ వార్డు నుంచి ఆ వార్డు ఇన్‌చార్జి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు టీడీపీలో చేరగా వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా బీజేపీ పట్టణ మాజీ ఉపాధ్యక్షుడు పొన్నగంటి మురళి టీడీపీలో చేరారు. ఆయనకు క్రిష్ణారెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా కావలి రూరల్ మండలం సిరిపురంకు చెందిన ముస్లింలు వైసీపీని వీడి షేక్ సుల్తాన్ ఆధ్వర్యంలో ముసునూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు : విశ్వబ్రాహ్మణ సంఘంకు చెందిన పలువురు నాయకులు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆసంఘం పట్టణ అధ్యక్షుడు గువ్వాడి ఓంకారాచారి, ప్రధాన కార్యదర్శి వీ.నరసింహారావు, కోశాధికారి బీ.శివాచారి, ఎన్. శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 25 : పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని ఐఎస్ రావునగర్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇకనైనా మేల్కొని జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడకుంటే మన బిడ్డల భవిష్యత్తుకు మనమే అన్యాయం చేసుకున్నవాళ్లమవుతామన్నారు. కందుకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతానికి చెందిన పలువురు వైసీపీని వీడి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, కొమర రమణయ్య, ఓరుగంటి రామ్మూర్తి, ముప్పవరపు కృష్ణ, గూండా వెంకటరావు, వీర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్లకు అభినందన



కాకర్లకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కొండాపురం, ఫిబ్రవరి 25: ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపికైన కాకర్ల సురేష్‌కు టీడీపీ మండల నాయకులు ఆదివారం వింజమూరులోని కాకర్ల క్యాంపు కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించారని, ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కాకర్ల నాయకులను, కార్యకర్తలను కోరారు. కాకర్లను కలసిన వారిలో భీమవరప్పాడు, నేకునాంపేట, యర్రబాలెం, గుడవళ్లూరు తదితర గ్రామాలకు చెందిన వారితో పాటు టీడీపీ మండల మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, నాయకలుఉ పీ.చంద్రబాబునాయుడు, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, కొమ్మి ప్రభాకర్, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, గుది పేరయ్య, అల్లిక మధు, జీ.మాధవరావు తదితరులు ఉన్నారు.

జనసేనకు మరికొన్ని సీట్లు కేటాయించాలి

కావలి, ఫిబ్రవరి 25: టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా మలివిడత జాబితాలో కూడా జనసేనకు గౌరవపదంగా చంద్రబాబు నాయుడు మరికొన్ని అసెంబ్లీ సీట్లు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య కోరారు. తొలివిడతలో జనసేనకు 24 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లని చెప్పడంతో జనసైనికులు అసంతృప్తితో ఉన్నారన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై, కర్నూల్‌లో ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పోకల చంటి, లక్ష్మణ్, రామకృష్ణ, బచ్చు ప్రసాద్ రావు, ఆనాల బ్రహ్మయ్య, పోలయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పయాగం



కావలిటౌన్, ఫిబ్రవరి 25: ముసునూరు ట్రంకురోడ్డులో మందాటి చెరువు వద్ద వెలసివున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి ఆదివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తోమల సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం పూజల అనంతరం అష్టోత్తర కలశస్నపనం పారమాత్మిక శాంతిహోమం నిర్వహించారు. ముసునూరు బాలాజీనగర్, ఆటోనగర్ వాస్తవ్యులచే రాత్రి శ్రీవారికి అర్చక బృందం నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తజనం పాల్గొని తిలకించారు.

వైసీపీని ఇంటికి సాగనంపడమే లక్ష్యం : దినేష్‌రెడ్డి



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలతో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

కొడవలూరు ఫిబ్రవరి 25 : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విస్మరించిన వైసీపీని ఇంటికి సాగనంపడమే లక్ష్యం అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలో యల్లయపాళెం పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఆదివారం వైసీపీ నుండి టీడీపీలో చేరగా వారికి దినేష్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాపురంను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించగలిగేది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పెట్టేందుకు సిద్ధం పేరుతో సభలు పెడుతున్నాడని, సభల్లో నిజాలు మాట్లాడం లేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పనున్నారన్నారు. టీడీపీ విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పిట్టు సూర్యనారయణ యాదవ్, కేతూ వెంకటరమణారెడ్డి, చెక్కా మదన్, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు, నాగభూషణం, చెముకుల వెంకయ్య, బద్వేల్ వినీల్‌రెడ్డి, పోలం రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో వెలుగు నింపుతాం...

కోవూరు : మహిళల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తోందని పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీనగర్, శివాజీనగర్‌ల్లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, దారా విజయబాబు, సూరిశెట్టి శ్రీనివాసులు, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, సాలూరు వెంకటేశ్వర్లు, నాటకరాని వెంకట్, యాకసిరి హరిబాబు ఉయ్యూరు వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతులే స్వయంగా నిర్వహించే సంస్థ ఎఫ్‌పీవో



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమణారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25 : రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్. పీ.ఓ) అంటే రైతులే స్వయంగా నిర్మించుకుని, నిర్వహణ చేసుకునే సంస్థ అని బుచ్చి ఎఫ్‌పీఓ చైర్మన్ ఇ రమణారెడ్డి అన్నారు. స్థానిక వవ్వేరు బ్యాంకు సమావేశ మందిరంలో ఆదివారం రైతు ఉత్పత్తిదారుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎఫ్‌పీఓ చైర్మన్ ఇ రమణారెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థలో రైతులే స్వయంగా ప్రమోటర్లుగా, డైరెక్టర్లుగా, షేర్ హోల్డర్లుగా ఉంటారన్నారు. సంస్థలో కనీసం 750మంది సభ్యులు చేరి రోజువారి నిర్వహణ కోసం ఒక మేనేజరు, సీఈఓని నియమించుకుని బోర్డులో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తారని తెలిపారు. సంస్థ ద్వారా సాగుకు అవసరమయ్యే పరికరాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను కంపెనీల నుంచి కొనుగోలు చేసి నేరుగా రైతులకు సరఫరా చేసుకునే అవకాశం వుంటుందన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతోపాటు వ్యాపారం ద్వారా వచ్చే లాభాలను సంస్థలోని రైతులందరికీ చెందుతాయన్నారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 10వేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేసిందని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగుతాయని తెలిపారు. భవిష్యత్తు కాలంలో బుచ్చిరెడ్డిపాళెంలోని రైతుఉత్పత్తిదారుల సంస్థ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచేలా కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అతిథులుగా జిల్లా కిసాన్ సంఘ్ సంఘసంచాలక్, ఎఫ్‌పీఓ జోనల్ అధికారులు బాలు సుబ్బారావు, యంవి రవిసింగ్, హరికిషోర్‌రెడ్డి, ఎం వెంకటేశ్, ఆర్ బానుచంద్ర, ఎస్ హర్షవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు రఘురామయ్య, బాలరాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, హరినారాయణ, శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పెంచలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి 25: లేఅవుట్‌లో నివాసాలు ఉండే వారి వినియోగార్థం వదిలిన స్థలంలో ఓ సామాజికవర్గం కోసం కమ్యూనిటీ హాలు నిర్మిస్తే అడ్డుకుంటామని బుచ్చిలోని ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో నివాసముండే మహిళలు హెచ్చరించారు. ఆదివారం వారు కమ్యూనిటీహాలు నిర్మించదలచుకున్న పబ్లిక్‌స్థలం వద్ద నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

కోవూరు, ఫిబ్రవరి 25: గ్రామాల్లో దోమల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమకాటుకు పలువురు మృతి చెందుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జొన్నాదుల రవికుమార్, ఇంటూరి విజయకుమార్, కుక్కంటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

వెంకటాచలం, ఫిబ్రవరి 25: మండలంలోని గొలగమూడిలోని గురుధ్యాన నిలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భగవాన్ వెంకయ్య స్వామి, దత్తాత్రేయ, సాయిబాబాకు అభిషేకాలు చేసి అంజనేయస్వామి నూతన విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన శ్రీ సత్యనారాయణస్వామి వ్రతంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. గురుధ్యాన నిలయం ట్రస్టు ప్రతినిధి అశోక్ చక్రవర్తి ఆధ్వర్యంలో శేఖర్‌నాయుడు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. వెంకయ్యస్వామి శిష్యులు స్వామి నారాయణ దాసు గురించి మద్దూరు శ్రీనివాసులు రచించిన పుస్తకాన్ని డాక్టర్ అశోక్ చక్రవర్తి ఆంగ్లంలో అనువాదం చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యుడు గంపల మంజుల, స్కూల్ విద్యార్థులు మహాత్మాగాంధీ విగ్రహం, పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం కొత్తూరు హైస్కూల్ ఉపాధ్యాయుడు పీవీ శేషయ్య స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికి టికెట్ ఇవ్వకపోవడం బాధాకరం : మంత్రి కాకాణి



సభలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు, ఫిబ్రవరి 25: జిల్లాలో సీనియర్ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి సర్వేపల్లిలో టికెట్ ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మండలంలోని పంటపాలెం పంచాయతీలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సోమిరెడ్డి పరిస్థితి చూస్తే చాలా బాధేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మారు సుధాకర్‌రెడ్డి, ఆలపాక రామ్మోహన్‌రెడ్డి, ప్రభాకర్ నాయుడు, బ్రహ్మానందం, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ గ్రూపు - 2 పరీక్షలు



అభ్యర్థులను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25: స్థానిక ఎస్‌కేఆర్‌ఎస్, డీఎల్‌ఎన్‌ఆర్ జూనియర్ కళాశాల, డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ హైస్కూలు లోని 2 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-2, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థులకు తాగునీరు, వైద్య సేవలు తదితర మౌలిక వసతులు కల్పించారు. 1వ పరీక్షా కేంద్రం ఎస్‌కేఆర్‌ఎస్ డీఎల్‌ఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో మొత్తం 160మంది పరీక్షలు రాయాల్సి వుండగా 28మంది, 2వ కేంద్రంలో 216మంది పరీక్షలు రాయాల్సి వుండగా 23 మంది గైర్హాజరయ్యారు. 1వ పరీక్షా కేంద్రానికి సంగం మండలం ఎంపీడీఓ రమాదేవి, 2వ కేంద్రానికి సంగం మండలం తహసీల్దారు శేషగిరిరావు పర్యవేక్షణాధికారులుగా, చీఫ్ సూపరింటెండెంట్‌గా రవీంద్రబాబు వ్యవహరించారు.

వెంకటాచలం : మండలంలోని మూడు కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూపు - 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న స్వాతి ఫార్మసీ కళాశాల, వెంకటాచలంలోని క్యూబా ఇంజనీరింగ్ కళాశాల, కాకుటూరులోని కృష్ణచైతన్య పీజీ కళాశాలల్లో గ్రూపు - 2 పరీక్షలు నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. వెంకటాచలం సీఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

కోవూరు, ఫిబ్రవరి 25: వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల పురుషుల ఛాంపియన్‌షిప్ కబడ్డీ పోటీల్లో ఆడేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా జట్టును ఆదివారం ఎంపికచేశారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులకు పోటీలు నిర్వహించి క్రీడాకారుల్ని ఎంపికచేశారు. ఈ పోటీల్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్, కార్యదర్శి జూగుంట విజయానందం, ఉపాధ్యక్షుడు పూండ్ల జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అభినందించింది.

వైభవంగా దేవదేవుని కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : నగరంలోని మహాత్మాగాంధీనగర్ సీతారామ మందిరంలో ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవారి తిరుమల మహాపాదయాత్ర సంకల్ప సాధన ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. భక్తులకు తలంబ్రాలు, కంకణాలు, మంగళసూత్ర దారాలు అందజేశారు. అన్నదానం చేశారు.

10న చలో విజయవాడ

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల గోల్డు అప్రయిజర్స్ అందరూ మార్చి 10న విజయవాడకు తరలిరావాలని అప్రయిజర్స్ నాయకుడు సాదా అనిల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ గోడ పత్రికలను ఆదివారం నగరంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకుల్లో పనిచేస్తున్న గోల్డు అప్రయిజర్స్ అందరికీ కలిపి రాష్ట్రస్థాయి సంఘం ఏర్పాటుకు విజయవాడ మొఘల్‌రాజపురం సిద్ధార్థ అకాడమీలో ద్వితీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా..!

● మాజీ మంత్రి నారాయణ



ప్రసంగిస్తున్న పొంగూరు నారాయణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 25 : రాబోవు ఎన్నికల్లో తాను గెలిచి, టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అభివృద్ధి అంటే ఏమిటో చూపి స్తానని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వెల్లడించారు. ఆదివారం నగరంలోని 3,4,5 డివిజన్లలో ఆయన పర్యటించారు. నారాయణతోపాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో పలువురు టీడీపీలో చేరారు. నారాయణ మాట్లాడుతూ నెల్లూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో నాయకురాలు అనూరాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో అరాచకపాలన పోవాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పాలన అవసరమని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం 4,7 డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో వైసీపీ రౌడీ పాలనలో ప్రజలలో భయం ఏర్పడిందన్నారు. 7వ డివిజన్‌లో వేణు చికెన్‌షాపును తొలగించేందుకు ప్రజాప్రతి నిధులు హెల్త్ అధికారిపై ఒత్తిడి తెచ్చి తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 25 : నగరంలోని 21 డివిజన్ టీచర్స్ కాలనీలో గల శ్రీ విజయ గణపతి దేవస్థానం 8వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఉభయకర్త వంగూరు పెంచల నరసారెడ్డి, ఆ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, మొయిళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 25 : నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కాకుపల్లి గ్రామ పంచాయతీలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఆదివారం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. రూరల్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కాకుపల్లి సర్పంచ్ కోసూరు సుభాషిణి, నాయకులు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, కేశవులు, వేణు(బాబ్జి), రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ హోమం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న అష్టలక్ష్మీ యాగంలో ఆదివారం లక్ష్మీనారాయణ హోమం వైభవంగా జరిగింది. అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకుడు పీతాంబరం రఘునాథాచార్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం తిరుప్పావై, అభిషేకం, ద్వారతోరణం పూజ, లక్ష్మీనారాయణ ఆరాధన కు ఉపదేశ పూర్వక ఆదిత్య హృదయ పారాయణం, పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం కోటి విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. కిడాంబి రామానుచార్యులును సత్కరించారు. మీనాక్షి నృత్యాలయం విద్యార్థుల ప్రదర్శలు అలరించాయి. సోమవారం విద్యార్థుల కోసం హయగ్రీవ హోమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలను అష్టలక్ష్మీ వైభవ దీపిక ఆధ్యాత్మిక సేవా సంస్థ, అష్టలక్ష్మీ యాగ కమిటీ సభ్యులు కటకం హరి, వేమూరి గిరి, కర్పూరం రమేష్, పరంధామయ్య, సుబ్బారావు పర్యవేక్షించారు.

ధర్మస్వరూపుడు శ్రీకృష్ణుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : మూర్తీభవించిన ధర్మస్వరూపుడు శ్రీకృష్ణుడు అని బత్తిన సాయికుమార్‌రెడ్డి తెలిపారు. పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి సంవత్సరం సందర్భంగా ఆదివారం జూనియర్ పురమందిరంలో 4వ సాహిత్య సభ జరిగింది. శాస్త్రి రచించిన శ్రీవాసుదేవ కథాసుధ గ్రంథంపై సాయికుమార్‌రెడ్డి ప్రవచనం చేశారు. వేదాలు, శ్రీమద్రామాయణం, భారతం, భాగవతం, హరివంశం, విష్ణుపర్వం, భవిష్యపర్వంలో శ్రీకృష్ణుని గురించిన యథార్థ కథలను జనరంజకంగా వివరించారు. పద్మ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో జ్ఞానకీ రామశర్మ రచించిన భారతీయ సాహిత్య సంస్కృతి ప్రకాశం అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. మెట్టు రామచంద్రప్రసాద్, ఎన్ బలరామయ్య నాయుడు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, వేదం రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. సాహితీవేత్త డాక్టర్ గిరిజాలక్ష్మిని సన్మానించారు.

దివ్యాంగుల పరిరక్షణ జీవోలు అమలు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : దివ్యాంగుల పరిరక్షణ చట్టం 2016లోని అన్ని జీవోలు అమలు చేయాలని వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, జాతీయ నాయకుడు గూడూరు రమణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని, వికలాంగులకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి 300 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అంత్యోదయ రేషన్‌కార్డులు ఇవ్వాలని, వివాహ బహుమతిని రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం కావలిలో జరిగే వికలాంగుల హక్కుల పరిరక్షణ కమిటీ సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. మార్చి 9న అమరావతి మహా గర్జనకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కిషోర్, సునీత, మరియమ్మ, సుజాత, భరత్, పెంచలమ్మ, సుదర్శనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్న వితరణ

నెల్లూరు (విద్య): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో గల సత్యసాయి ట్రస్ట్‌లో ఆదివారం 200 మంది పేదలకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్య పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాలు చేయాలన్న లక్ష్యంతో తొలుతగా అన్నదా నం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్, కోశాధికారి కే జయదేవ్, సభ్యులు రాఘవేంద్రశెట్టి, ఓబుల్‌రెడ్డి, చింతల అమరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

53, 54 డివిజన్లకు కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ప్రసాద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం): వెంకటేశ్వరపురం పరిధిలోని 53, 54 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నరసాపురం ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రకటించారు. 54 డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం, పార్టీలో భారీగా చేరికలు కార్య క్రమాన్ని ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చేవూరు హాజరయ్యారు. శ్రీనివాసులు రెడ్డి, ఫయాజ్, అల్లాఉద్దీన్, హుస్సేన్‌బాషా, శ్రీరాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

● ఎమ్మెల్యే కోటంరెడ్డి సమక్షంలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. 30వ డివిజన్ వైఎస్ఆర్ నగర్‌కు చెందిన దుర్గాబాబు, షేక్ మస్తాన్, ఎస్ పెంచలనాయుడు, పీ సాంబ, కే చెంచుకృష్ణ, సీహెచ్ కృష్ణ, బీ ప్రభు మిత్ర బృందం, 17వ డివిజన్ వెలగచెట్టు సంగానికి చెందిన షేక్ మస్తానీ, షేక్ బీబీజాన్, షేక్ మెహనా వారి మిత్ర బృందం పార్టీలో చేరారు. అలాగే, 22వ డివిజన్ ఎన్‌జీవో కాలనీకి చెందిన గెట్టిబోయిన రాజేంద్రప్రసాద్ యాదవ్, రమేష్ యాదవ్, పాపనబోయిన శ్రీనివాస యాదవ్ వారి మిత్ర బృందానికి, 28వ డివిజన్ కేశవుల నగర్‌కు చెందిన బీ శివ, ఆర్ రవి, మహేంద్ర, రాజేంద్రన్, వెంకట రమణ, శేఖర్, ఉదయ్‌కుమార్ వారి మిత్ర బృందానికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమంచర్ల పంచాయతీ గోటువారి కండ్రిగకు చెందిన కూకటి పుట్టయ్య, కూకటి మోహన్, కూకటి వెంకటేష్, మన్నవరం సురేష్, సేవజ్యోతి కాలనీకి చెందిన ఎల్ ఏడుకొండలు, వారి మిత్ర బృందం కూడా టీడీపీ తీర్థం పుచ్చుకుంది. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, మన్నేపల్లి రఘు, కూకటి హరిబాబు యాదవ్, సాబీర్‌ఖాన్, ఊటుకూరు దత్తాత్రేయ, జలదంకి సుధాకర్, మలినేని వేణునాయుడు, కంటే సాయిబాబా, యోగానందం, దొడ్డపనేని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

● టీడీపీ నేత అజీజ్



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న అజీజ్ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 25 : సంక్షేమం, అభివృద్ధి రెండూ అమలైతేనే ఆర్థిక వ్యవస్థ బలపడి పేదరిక నిర్మూలన జరుగుతుందని, ఈ రెండింటినీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాత్రమే చేయగలరని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. 54వ డివిజన్ ఇస్లాంపేటలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలను కాపాడుకునే బాధ్యత టీడీపీ తీసుకుంటుం దన్నారు. నెల్లూరు నగరంలో మాజీ మంత్రి నారాయణను గెలిపించుకుందామని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీర్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'హిమాలయ' వార్షికోత్సవం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25 : నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం సంతోష్ తరంగ్ పేరుతో నిర్వహించిన హిమాలయ పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు అంకితభావంతో విద్యను అందించడంలో గురువులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల్లో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహిం చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గెలుపోటములు నిర్దేశించే శక్తి ముస్లింలది.. సమీర్‌ఖాన్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 25 : ఎన్నికల్లో నెల్లూరు నగర్, రూరల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములు నిర్దేశించే శక్తి ముస్లింలకు ఉందని వైసీపీ మైనార్టీ నేత సమీర్‌ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడా రు. కొంత కాలంగా తాను పార్టీ మారుతున్నాననే ప్రచారం చేస్తున్నారని, అందులో నిజం లేదన్నారు. నగరంలో గెలవాలంటే 70 వేల మంది ముస్లింల ఓట్లు కీలకమని చెప్పారు.

కమనీయంగా ఆదికేశవస్వామి కల్యాణం



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 : నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామివార్ల ఎదురుకోలు ఉత్సవం, మాంగల్యధారణ, తలంబ్రాలు, మాలల మార్పిడి వంటి ఘట్టాలు భక్తులను తన్మయులను చేశాయి. మధ్యాహ్నం నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులకు భారీ అన్నదానం జరిగింది. రాత్రి అశ్వ వాహనంపై ఆదికేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), ఫిబ్ర వరి 25: అవినీతిమ యమైన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించ డానికి ప్రజలు సిద్ధం అయ్యారని బీజేపీ రాష్ట్ర మోర్చాల ఇన్‌చార్జి పీ సురేంద్రరెడ్డి అన్నారు. బీజేపీ ప్రజాపోరు కార్యక్ర మం ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్క్, బలిజపాలెం, యలమవా రిదిన్నె, బాలాజీ నగర్ అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ సెంటర్, మసీద్‌సెంటర్, పాలబూత్ సెంటర్లలో జరిగింది. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ, అవినీతి లక్ష్యంగా వైసీపీ ప్రభు త్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. ఇసుక, సిలికా, మట్టి ఇలా అన్నింటా దోపిడీతో రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని ఆరోపించారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృ త్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్లు మార్చి ఇస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, మిడతల రమేష్, జీవీటీ ప్రభాకర్, హర్షవర్ధన్, కిరణ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో ఆరోగ్య సదస్సు

నెల్లూరు (విద్య): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్టేడియంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి గుండె వైద్యుడు శ్రీనివాసరాజు పాల్గొని గుండె సంబంధిత, మధుమేహ, హైపర్ టెన్షన్, ఓబేసిటీ తదితర వ్యాధులపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీఏ రామారావు, కార్యదర్శి జీవీ సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోకీలు మార్పిడిలో సిరామిక్ ఇంప్లాంట్స్

● అపోలో ఆసుపత్రి డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి


నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 25 : మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలో నూతన సిరామిక్ ఇంప్లాంట్స్ విధానం అందుబాటులోకి వచ్చిందని అపోలో ఆసుపత్రి కీళ్ల, ఎముకల వ్యాధుల నిపుణుడు డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. ఆదివారం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరామిక్ ఇంప్లాంట్స్ వంద శాతం సురక్షితమన్నారు. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు కూడా రావని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024





ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి కావాల్సిన వారికి తాయిలాలు ప్రకటించేందుకు టీటీడీ సిద్ధమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో నేటి ఉదయం 10 గంటలకు జరిగే పాలకమండలి సమావేశంలో మూడు దశాబ్దాల కిందటే గడువు ముగిసిన తట్ట లైసెన్సులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుకూలుర షాపులకు ఒకచోట నుంచీ మరోచోటకు తరలించేందుకు అనుమతులు లభించనున్నాయి. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా 400మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయనున్నారు.ఇంజనీరింగ్ పనులకూ పెద్దఎత్తున అనుమతులు ఇవ్వనున్నారు.

-తిరుపతి,ఆంధ్రజ్యోతి

టీటీడీ అజెండాలో

ఎన్నికల తాయిలాలు!

నేటి పాలకమండలి సమావేశం ముందుకు పలు కీలక అంశాలు

తిరుమలలో దుకాణాలు కాకుండా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే హాకర్లకు టీటీడీ తట్ట లైసెన్సులు జారీ చేసే విషయం తెలిసిందే.వీటికి విపరీతమైన డిమాండ్, విలువ వుంది. లైసెన్సులు తీసుకున్న వారు అనధికారికంగా ఇతరులకు రోజువారీ లేదా నెలవారీ సబ్ లీజులకు ఇచ్చి లక్షలు సంపాదిస్తుంటారు. కీలక ప్రాంతాలు, కూడళ్లలో వీటి అద్దెలు ఊహించలేని విధంగా వుంటాయి. 1987 నుంచీ 1993 మధ్య గడువు ముగిసిన సుమారు 162 తట్ట లైసెన్సులను పునరుద్ధరించే అంశాన్ని ప్రస్తుత సమావేశ అజెండాలో చేర్చినట్టు సమాచారం. ఇందులో 90 వరకూ లైసెన్సులను వైసీపీకి సంబంధించిన వారు కొనుగోలు చేశారని, వారి పేరిట తాజాగా సంబంధిత లైసెన్సులను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారని సమాచారం. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఉపయోగపడే కీలక వ్యక్తులకు ఈ సాయం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తిరుమల కొండపై తట్ట లైసెన్సులతో పోలిస్తే వందరెట్లు అధిక విలువ, డిమాండ్ దుకాణాలకు వుంటుంది. తిరుమలలో టీటీడీ నుంచీ షాపులు పొందిన వారిలో అధికశాతం యజమానులు భారీ మొత్తాల్లో అడ్వాన్సులు, అద్దెలు తీసుకుని ఇతరులకు అప్పగిస్తుంటారు. యాత్రికుల రద్దీ అధికంగా వుండే ప్రాంతాల్లోనూ, కీలక కూడళ్లలోనూ వుండే షాపుల విలువ అపారంగా వుంటుంది. అక్కడ షాపుల అడ్వాన్సులు, అద్దెలు సామాన్యుల ఊహకందవు. యాత్రికుల సందడి తక్కువగా వున్న ప్రాంతాల్లోని షాపుల యజమానులు తమ షాపులను అనువైన చోటకు తరలించుకునేందుకు ఎంత భారీ మొత్తాలైనా చెల్లించేందుకు సిద్ధపడతారు. అయితే దానికి కూడా పైస్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీ మొత్తాలు సమర్పించుకుంటే గానీ పనులు జరగవు. నేటి పాలకమండలి సమావేశంలో 14 షాపులను ఒకచోట నుంచీ మరోచోటకు తరలించే అంశాన్ని అజెండాలో పొందుపరిచినట్టు సమాచారం. ఇవన్నీ కూడా అధికార పార్టీ ముఖ్యనేతలకు బాగా కావాల్సిన వారివని సమాచారం.

30 ఏళ్ళ క్రితం గడువు ముగిసిన తట్ట లైసెన్సుల పునరుద్ధరణ

నెలలోపే పాలకమండలి రెండో భేటీ

టీటీడీ పాలక మండలి సమావేశం చివరగా గత నెల 29వ తేదీన జరిగింది. సాధారణంగా పాలకమండలి సమావేశాలు రెండు నెలలకు ఓమారు జరుగుతాయి. అయితే నెలలోపే రెండోసారి సమావేశం ఏర్పాటు కావడంతోనే అందరి దృష్టీ సమావేశంవైపు, అజెండా వైపూ మళ్ళుతోంది. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాలు పొందే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకే ఈ సమావేశం జరుగుతోందన్న ఆరోపణలకు ఇది బలం చేకూర్చేలా వుంది. మరోవైపు ఎన్నికలయ్యాక ప్రస్తుత ప్రభుత్వం తిరిగి వస్తుందో రాదోనన్న అనుమానం వుండడం వల్లే తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే ఉద్దేశంతోనే నెలలోపే రెండో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారమూ జరుగుతోంది.

400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్

టీటీడీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేసే అంశం కూడా అజెండాలో వున్నట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలో, వాటర్ వర్క్స్, ప్రెస్ పబ్లికేషన్స్ విభాగం వంటి వాటిల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఈ ఉద్యోగులకు ప్రస్తుతం 14 వేల వరకూ వేతనం అందుతోంది. వీరికి టైమ్ స్కేల్ వర్తింపజేస్తే ఏకంగా వేతనం రూ. 30 వేల వరకు పెరగనుంది.

భారీగా ఇంజనీరింగ్ పనులకు అనుమతులు

టీటీడీ ఇంజనీరింగ్ కాంట్రాక్టు పనులను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ ముఖ్యనేత పాలక మండలిని అడ్డుపెట్టుకుని భారీగా పనులకు అనుమతులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఇంజనీరింగ్ పనులు పెద్దఎత్తున ప్రతిపాదించి వాటికి అనుమతులు జారీ చేయడం ద్వారా పర్సంటేజీలు వసూలు చేసుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎస్వీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

గ్రూప్-2 పరీక్షలకు 23,171మంది హాజరు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 25 : తిరుపతి నగరంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జిల్లాలోని 61 కేంద్రాల్లో నిర్వహించారు. అధికారులు కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించారు. కొందరు వాచీలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడంతో వాటిని స్వాధీనం చేసుకుని, అక్కడ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భద్రపరిచారు. కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. 27,921మందికిగాను 23,171మంది (82.99 శాతం) హాజరైనట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు అన్ని శాఖల సమన్వయంతో పరీక్షల నిర్వహణ విజయవంతమైందని పేర్కొన్నారు.

వేడుకగా దోపు ఉత్సవం



దోపు ఉత్సవంలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తొండమాన్ చక్రవర్తుల దోపు ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పురాతన కాలంలో ఆలయంలో చోరీ జరగడంతో తొండమాన్ చక్రవర్తి నేరుగా వచ్చి దొంగతనం చేసిన వ్యక్తులు గుర్తించి వారి నుంచి దొంగిలించిన నగలను తిరిగి ఆలయానికి అప్పగించడం జరుగుతుంది. దీనికి ప్రతిగా ఆలయంలో ప్రతి ఏటా మాఘమాస పౌర్ణమి తర్వాత దొంగదోపు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అలంకార మండపంలో అలకరించిన తర్వాత ప్రత్యేక పూజల అనంతరం నాలుగు వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాలూరు క్రాస్‌లో

దారుణ హత్య

పట్టపగలే కత్తులతో నరికి చంపిన దుండగులు ● సోదరుడిపైనే అనుమానం

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 25: పట్టపగలే... నడిరోడ్డుపై ఓ వ్యక్తిని అటకాయించి... పారిపోతుండగా వెంటాడి కత్తులతో దారుణంగా నరికి చంపిన ఘటన తిరుపతి రూరల్ మండలంలో ఆదివారం జరిగింది.పోలీసుల కథనం మేరకు... ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన కానాల భాస్కర రెడ్డికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. వీరిలో రామ్మోహన్‌రెడ్డి పెద్ద కుమారుడు కాగా చంద్రశేఖరరెడ్డి (50) రెండో కుమారుడు. రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతిలోని మంచినీళ్లగుంట సమీపంలో నివాసం ఉంటుండగా చంద్రశేఖర్‌రెడ్డి స్వగ్రామంలోనే వుంటున్నాడు. చంద్రశేఖర రెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖర రెడ్డి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. కొంత సమయం గడిపిన తరువాత పిల్లలు తినుబండారాలు కావాలనడంతో వాటిని తీసుకొస్తానంటూ సాయంత్రం 3గంటలకు బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఐదుగురు వ్యక్తులు చంద్రశేఖరరెడ్డిని అటకాయించారు. ఆయన ద్విచక్రవాహనంపై ఉండగానే దాడిచేయడం ప్రారంభించారు.దీంతో పరుగెత్తి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో దారుణంగా నరికి వెళ్లిపోయారు.ఈ దాడిలో చంద్రశేఖరరెడ్డి ముఖం సగానికి పైగా రెండుగా తెగిపోయింది. ఓ చేతివేలు తెగి కిందపడిపోయింది. కుడిచేయి మణికట్టువద్ద ఎముకతో సహా విరిగిపోయింది. తీవ్రరక్తస్రావంతో అల్లాడిపోతున్న చంద్రశేఖరరెడ్డిని స్థానికులే 108అంబులెన్సులో రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన భర్తను ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తంచేస్తూ మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి పాత నేరస్తుడని సమాచారం. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ ఉండగా ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లోకూడా ఆయనపై కేసులున్నట్టు చెబుతున్నారు. అన్నదమ్ములిద్దరికీ కొంతకాలంగా ఆస్తి తగాదాలు నడుస్తున్నందున అన్నే మరికొందరితో కలిసి తమ్ముడిని హతమార్చి ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.రామ్మోహన్‌రెడ్డికి ఎర్రచందనం అక్రమ రవాణాలోకూడా భాగస్వామ్యం ఉందని, ఈ విషయాన్ని చంద్రశేఖరరెడ్డి బయట పెట్టినందుకే హత్యకు పాల్పడ్డారని కూడా ప్రచారం జరుగుతోంది.





మృతుడు చంద్రశేఖర రెడ్డి

పాపం.. యంత్రాంగం!

చంద్రబాబు నియోజకవర్గానికి నీళ్లిచ్చామని చెప్పుకునేందుకు సర్కారు ఆపసోపాలు

రామకుప్పం, ఫిబ్రవరి 25:టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి తామే కృష్ణా జలాలను ఇచ్చామని చెప్పుకునేందుకు వైసీపీ ప్రభుత్వం చేసే ప్రయత్నాలు అధికారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి.సోమవారం సీఎం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువగేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయనున్నారు. ఇందుకోసం రెండు రోజుల కిందట వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్ నుంచి నీళ్లను వదిలారు. ఆ జలాలు ఆదివారం సాయంత్రానికి రాజుపేట వద్దకు చేరుతాయని అధికారులు భావించగా, శనివారం రాత్రికే చేరుకున్నాయి. జల ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రాజుపేట హంద్రీ-నీవా గేట్‌కు ఎగువ ప్రాంతంలో మట్టితో వేసిన అడ్డుకట్ట తెగిపోయింది. దీంతో గేట్ పైభాగం నుంచి జలాలు గేట్‌ను దాటుకుంటూ ముందుకు ప్రవహించాయి. సీఎం గేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయకముందే ముందు కు సాగాయి. ఇక్కడ గేట్‌ను రెండు రోజుల కిందటే ఏర్పాటు చేయడంతో ఒక దశలో గేట్ కొట్టుకుపోతుందన్న ఆందోళనతో ఆదినపల్లె లిఫ్ట్ యూనిట్ వద్ద మోటార్లను ఆపు చేయించారు. సోమవారం తెల్లవారుజామున మోటార్లను ఆన్‌చేసి జలాలను రాజుపేటకుచేరేలా ప్లాన్ చేశారు.



రాజుపేట వద్ద ఆదివారం కాలువగేటు పైభాగం నుంచి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

నేడు కుప్పానికి సీఎం రాక

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 25: ముఖ్యమంత్రి జగన్ కుప్పం నియోజకవర్గంలో సోమవారం పర్యటించనున్నారు.ఉదయం 9.45 గంటలకు సీఎం తిరుపతి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి రాజుపేటకు చేరుకుంటారు.10.30 గంటలకు హంద్రీనీవా సుజల స్రవంతి నీటిని విడుదల చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకుంటారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించాక కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగసభలో పాల్గొంటారు.

ఆరు కిలోమీటర్లు.. రెండు హెలిప్యాడ్లు

రాజుపేట నుంచి గుండిశెట్టిపల్లె మధ్య దూరం ఆరు కిలోమీటర్లే ఉంది. అయినా అధికార యంత్రాంగం రాజుపేట, గుండిశెట్టిపల్లెలో ఒక్కోటి చొప్పున రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

టీడీపీ హయాంలోనే పూర్తయిన 80శాతం పనులు

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారించాలన్న తలంపుతో అప్పట్లో కుప్పం మండలం పరమసముద్రం చెరువు వరకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మార్గంలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని పలు పెద్దచెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలన్న బృహత్ ప్రణాళికతో 2016లో పనులు ప్రారంభించింది. 2019 నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు హంద్రీ-నీవా జలాలు వి.కోట మండలం కృష్ణాపురం వరకు వచ్చాయి. వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో వైసీపీ నేతల ప్రోద్బలంతో కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో అక్కడక్కడా కాలువ తవ్వకం పనులు చేపట్టలేకపోయారు. 2019 తర్వాత కోర్టు సమస్యలు పరిష్కారమయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ గద్దెనెక్కడంతో హంద్రీ-నీవా పనులు స్తంభించాయి. నాలుగేళ్ల పాలనలో మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయాలన్న విషయాన్ని పట్టించుకోలేదు. 2022లో కుప్పం పర్యటనకు వచ్చిన జగన్ ఆరు నెలల్లో హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయినా పనులు ముందుకు సాగలేదు. ప్రసుత్తం ఎన్నికలు ముంచుకొస్తుండడంతో హడావిడిగా పనులు పూర్తి చేశారు.అక్కడక్కడా గుట్టలను తొలిచి కాలువ తవ్విన చోట జలాలు బండల నెర్రెల మధ్య భూమిలోకి వెళ్తున్నాయి. దీంతో పూర్తి స్థాయిలో జలాలు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

వైసీపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, నెలవల

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 25: వైసీపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొదటి జాబితాలో ఇద్దరు ఎస్సీ అభ్యర్థులను టికెట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. టీడీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని, గత ఐదేళ్లలో పార్టీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రి ఖనిజ సంపదను ఎలా దోచుకున్నారో ప్రజలందరూ చూస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. తిరుపతిలో ఈనెల 27వ తేదీ మంగళవారం జరగబోవు జయహో బీసీ సదస్సులో బీసీ సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నారా లోకేశ్ యువతకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో తన కుమార్తె విజయశ్రీకి టికెట్టు కేటాయించడం జరిగిందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి టీడీపీని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంచి కృష్ణయ్య, శోభన్ నాయుడు, దార్ల రాజేంద్ర, ప్రసాద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు: పాశం



టీడీపీలో చేరిన వారితో సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 25: వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీలోకి చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. చార్జీలు, పన్నులు, ధరలు విపరీతంగా పెంచేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని మరచి దోచుకోవడమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వం అవినీతిని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, దాడులు చేయడమేకాక తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు, రైతులకు, బీసీలకు, అన్ని వర్గాల ప్రజలు పలు సంక్షేమ పథకాలు అందించేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను విడుదల చేశారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, మట్టం శ్రావణి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కొమ్మనేటూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీలోనే ఎస్సీలకు ప్రాధాన్యం

గూడూరు, ఫిబ్రవరి 25: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల మొదటి జాబితాలో ఎస్సీలకు ప్రాధాన్యం కల్పించారని తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన తొలి జాబితాలో 18మంది ఎస్సీలకు టికెట్లు కేటాయించడం జరిగిందన్నారు. టీడీపీ అభ్యర్థుల జాబితాను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు కనీసం వైసీపీ అభ్యర్థులు కూడా దొరకడంలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల ఇన్‌చార్జీలందరూ ఎమ్మెల్యే అభ్యర్థులు కాదని వైసీపీ నేతలు మాట్లాడడమే ఇందుకు నిదర్శనమన్నారు. దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్, పెంచలయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: మస్తాన్ యాదవ్



కరపత్రాలు అందజేస్తున్న మస్తాన్ యాదవ్

వెంకటగిరి, ఫిబ్రవరి 25: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని 3వ వార్డు బీసీ కాలనీలో పర్యటించిన ఆయన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నాయుడుపేట, ఫిబ్రవరి 25: దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు యాగాని ఆదిముని, కన్నలి సింగయ్య, బందిల గురవయ్య, మునిశేఖర్‌బాబు, చెంగయ్య, వెంకటరమణయ్య, మహేష్ తదితరులు ఆదివారం నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దార్ల రాజేంద్ర, అంకయ్య, బెన్ని, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల సమావేశం

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని మొగ్గళ్లగుటంలో వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు, పనిచేయాలని సూచించారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ



దుస్తులు, దుప్పట్లు, దిండ్లు అందజేస్తున్న వెంకటేశ్వర్లుబాబు దంపతులు

నాయుడుపేట, ఫిబ్రవరి 25: నాయుడుపేట సంజాయ్‌గాంధీ నగర్‌లోని మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం యూనైటెడ్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్ మేనేజర్ కొణిజేటి వెంకటేశ్వర్లుబాబు దంపతులు దుస్తులు, దుప్పట్లు, దిండ్లు అందజేశారు. ఆశ్రమం నిర్వాహకురాలు సునీత బెన్నీ, హారిక పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాలాయపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన ఈతముక్కల రత్నమ్మపై అదే గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పెంచలరామయ్య, ఆయన అల్లుడు, కుమార్తెలు రాగయ్య, పూజ, మారుతి, బతుకమ్మ దాడి చేశారని బాధిరాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై ఈతముక్కల రత్నమ్మ దాడి చేశారని జొన్నలగడ్డ పెంచలరామయ్య కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభానీ తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సెప్టిక్ ట్యాంకులో పడి బాలుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి 25: మండలంలోని మిటాత్మకూరు గ్రామంలో ఆదివారం ఓ బాలుడు ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... మిటాత్మకూరు గ్రామానికి చెందిన పరుశురామ్(8) 3వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్థానిక సచివాలయ సమీపంలో ఆడుకుంటూ నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో పడి మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

బీరు బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

గూడూరు, ఫిబ్రవరి 25: అక్రమంగా తరలిస్తున్న 48టిన్ బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రైల్వేజీఆర్ పోలీసులు తెలిపారు. రైల్వేజీఆర్పీ ఎస్ఐ కొండప్పనాయుడు కథనం మేరకు.... శనివారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం కోట్లపూడి గ్రామానికి చెందిన నాగేంద్రబాబు 48 టిన్ బీరు బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది వెంకటేశ్వర్లు, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

మిరప ధర ధమాల్

- ఎకరాకు రూ.లక్షకు పైగా నష్టం
- లబోదిబోమంటున్నరైతులు



పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25: సీజన్‌లో వర్షాలు లేకపోవడం, వరదలు ముంచెత్తడంతో వరి, వేరుశనగ, చెరకు పంటలను సాగుచేయలేక ఎక్కువమంది రైతులు పచ్చిమిర్చి వైపుగా మొగ్గుచూపారు. ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకే పరిమితమైన మిర్చిని ప్రస్తుతం సూళ్లూరుపేట, నాయుడుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 8 వేల ఎకరాలకు పైగా సాగుచేస్తున్నారు. విత్తనాలు కొనుగోలు నుంచి నాట్లు వరకు రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకొని పంటను సాగుచేశారు. తీరా దిగుబడి చేతికొచ్చే సరికి ఒకసారిగా ధరలు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళంపాడు, మతకాముడి, ఉగ్గుముడి, సుగ్గుపల్లి, మంగానెల్లూరు, దామానెల్లూరు, వెలగలపొన్నూరు, ఉచ్చూరు ప్రాంతాలల్లో విస్తృతంగా మిర్చి సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే మేలురక మిర్చికి మంచి గిరాకీ ఉంటుంది. దీంతో రైతులు చెన్నై, విజయవాడ, బెంగళూరు, ఢిల్లీ నగరాలకు ఎగుమతి చేసి మంచి లాభాలను పొందేవారు.

పంట చేతికొచ్చే సమయంలో పడిపోయిన ధరలు

సూళ్లూరుపేట ప్రాంతంలో రైతులు మేలురకం మిరప జాతులైన ఇండాం-5, ఇండాం-67, ప్రియాంక, వజ్ర, నాందారి, సున్నా-56, జేకే రకాలను సాగు చేస్తూ ఉద్యానవన అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేవారు. ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయాన్ని పొందేవారు. అయితే ప్రస్తుతం కిలో రూ.15 నుంచి 20 వరకు ధర పలుకుతుండడంతో నష్టాలను చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల ముందు కిలో మిర్చి రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలికేది. పంట కోత దశలో ఒకసారిగా ధరలు పడిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పండు మిర్చి కూడా కిలో రూ.220 నుంచి రూ.120కి పడిపోయింది. ఎకరం మిర్చి సాగుకు రూ.80 నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను మిర్చి ధర రూ.20 వేలు మాత్రమే పలుకుతోంది. ఎకరానికి 5 టన్నులు దిగుబడి వచ్చినా నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సవరించే వరకు పోరాటం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 25: ఓటర్ల జాబితాలో తప్పులు సవరించే వరకు పోరాడతామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తప్పులు సవరించకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారో ప్రభుత్వమే చెప్పాలని ప్రశ్నించారు. కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకే ఓటర్ల జాబితా సవరణలపై అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కేవలం దొంగ ఓట్లతో గద్దె నెక్కేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. జాబితాలో తప్పులపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని, ఒక వ్యక్తికి రెండు నుంచి మూడు ఓట్లు ఉన్నాయంటే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. జాబితాలో ఉన్న తప్పులను ఆధారాలతో సహా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సవరించే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. అదేవిదంగా ఈ నెల 27వ తేదీ తిరుపతిలో జరగనున్న జయహో బీసీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి తాండవ చెంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంగమనాయుడుపల్లి మాతమ్మగుడిలో చోరీ

సవరం బంగారు, హుండీలో నగదు అపహరణ

డక్కిలి, ఫిబ్రవరి 25: మండలంలోని వెంగమనాయుడుపల్లిలోని మాతమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. అమ్మవారి మెడలో వున్న ఒక సవరం బంగారు అభరణం, ఆలయంలోని హుండీ ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం మేరకు.. వెంగమనాయుడుపల్లి మాతమ్మ గుడి తాళం పగలగొట్టి వుండటాన్ని గ్రామస్తులు ఆదివారం ఉదయం గమనించారు. లోపలకి వెళ్లి చూడగా అమ్మవారి మెడలో వున్న ఒక సవరం బంగారు అభరణం కనిపించలేదు. హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లి ఉండడాన్ని గమనించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ.50 వేల వరకు నగదు వుండి వుండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయాన్ని ఎస్ఐ చౌడయ్య పరిశీలించారు.

నీరు లేక పంటలు ఎండుముఖం

కాపాడుకునేందుకు రైతుల పాట్లు

బాలాయపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని పిగిలాం కొత్తపాళెం, గాజులపల్లి, కాలగంద, కామకూరు, హస్తకావేరి తదితర గ్రామాల్లో రైతులు వరిపంటను కాపాడుకునేందు పడుతున్న నానాపాట్లు పడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతి కందే దశలో చివరి తడి నీళ్ల లేక ఎండుముఖం పడుతున్న వరి పైరును చూసి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కనీసం తెలుగుగంగ నీటిని వదిలి ఆదుకుంటారని రైతులు ఆశగా ఎదురు చూశారు. అయితే అధికారులు కొన్ని గ్రామాలకే గంగ నీటిని విడుదల చేయడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులకు తెలుగుగంగ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణం

బాలాయపల్లి, ఫిబ్రవరి 25: తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టినా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై స్థానిక సర్పంచు దట్టం అంజలి పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. అయినప్పటికీ ఆక్రమణదారులు దర్జాగా నిర్మాణం కొనసాగిస్తున్నారు. దీనిపై కోర్టు దిక్కరణ పిటిషన్ దాఖలు చేశామని, ఈ మేరకు తహసీల్దారుకు నోటీసులు జారీ అయ్యాయని సర్పంచు తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అంజలి తెలిపారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అశ్వర్థ వృక్షం, నింబ వృక్షాలకు కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తయంగా సంకల్ప పూజలు చేసి రెండు వృక్షాలను వస్త్రాలతో అలంకరించి కల్యాణ సంప్రదాయాలను అనుసరిస్తూ కంకణధారణ చేసి మాంగల్యధారణ చేశారు. ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తిలకించారు. ఉభయకర్తలుగా సారంగపాణి, మస్తాన్ నాయుడు దంపతులు వ్యవహరించారు. ఆలయ ఛైర్మన్ అయితా శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్షలు

గూడూరు, ఫిబ్రవరి 25: పట్టణంలో ఆదివారం పలు కేంద్రాల్లో నిర్వహించిన ఏపీపీఎస్‌ఈ గ్రూపు-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాల, నారాయణ ఇంజనీరింగ్, ఆదిశంకర ఇంజనీరింగ్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గ్రూపు-2 పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులను పోసులు తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి పంపారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూపు-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 400మంది అభ్యర్థులకు గాను 230 మంది హాజరై పరీక్షలు రాశారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటగిరి, ఫిబ్రవరి 25: వెంకటగిరి పట్టణంలోని మదర్ అకాడమీ పాఠశాల ప్రాంగణంలో స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సూళూరుపేట వీనస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి గుండె వైద్యనిపుణులు కోవి వెంకన్నబాబు, జనరల్ ఫిజీషియన్ ప్రవీణ్ కుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద యువసైన్యం సభ్యులు దనియాల శామ్‌కుమార్, గుగ్గిల్ల కోటేశ్వరావు, గోపీనాథ్, వీరా, పోతులూరు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కంటి వైద్యశిబిరం

గూడూరు, ఫిబ్రవరి 25: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం పెళ్లకూరు గ్రామానికి చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ఈవో కృష్ణ మాట్లాడుతూ పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన పేదలకు ఉచితంగా వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశామన్నారు.

ఐదు దుకాణాల్లో చోరీ

కోట, ఫిబ్రవరి 25: కోట పట్టణంలోని ఐదు దుకాణాల్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మండల కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న సంజీవయ్య పండ్ల దుకాణంలోకి దుండగులు చొరబడి సీసీ కెమెరాలను పగలగొట్టి బయట పడేశారు. దుకాణంలో రూ.80వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. సమీపంలో ఉన్న నాలుగు దుకాణాల్లోనూ చోరీకి పాల్పడ్డారు. కానీ అక్కడ విలువైన వస్తువులు ఏవీ లేవు. చోరీ జరిగిన దుకాణాలను పోలీసులు పరిశీలించారు. క్లూస్‌టీమ్ పిలిపించి ఆధారాలు సేకరించారు.

చేడిమాలలో చోరీ



చోరీ జరిగిన ఇంటి వద్ద బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు, ఫిబ్రవరి 25: మండలంలోని చేడిమాల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ భర్త, కుమారుడు మూడేళ్ల క్రితం కరోనాతో మృతి చెందడంతో ఒక్కటే ఉంటోంది. ఈనెల 21న ఇంటికి తాళాలు వేసి వెంకటగిరిలోని బంధువుల దగ్గరకు వెళ్లింది. ఆదివారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 6 సవర్ల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, లక్ష రూపాయల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 24: మోటారు సైకిళ్ల దొంగలు పట్ట పగలే చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలో పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్న మునివర్ధన్ రెడ్డి తన మోటారు సైకిల్‌ను శనివారం పాత బస్టాండు వద్ద ఓ చెప్పుల దుకాణం ఆపాడు. లోనికి వెళ్లి చెప్పులు తీసుకొంటుండగా గుర్తు తెలియని యువకుడు మోటారు సైకిల్‌ను తీసుకొని పారిపోయాడు. మునివర్ధన్ రెడ్డితో పాటు స్థానికులు కేకలు వేస్తూ వెంబడించినా ఫలితం లేకపోయింది. బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీరు బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

గూడూరు, ఫిబ్రవరి 25: అక్రమంగా తరలిస్తున్న 48టిన్ బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రైల్వేజీఆర్ పోలీసులు తెలిపారు. రైల్వేజీఆర్పీ ఎస్ఐ కొండప్పనాయుడు కథనం మేరకు.... శనివారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం కోట్లపూడి గ్రామానికి చెందిన నాగేంద్రబాబు 48 టిన్ బీరు బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు రైల్వేజీఆర్పీ ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో వెంకటేశ్వర్లు, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 25: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి హోమ పూజలు

గూడూరు, ఫిబ్రవరి 25: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం సుదర్శనహోమ పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 25: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈవీఎంలు వద్దంటూ పోస్టుకార్డు ఉద్యమం



ఈవీఎం వద్దంటూ పోస్టుకార్డుపై సంతకం చేసి అందజేస్తున్న ఓటర్లు

కోట, ఫిబ్రవరి 25: కోరుతూ మండలంలోని చిట్టేడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త షేక్ రఫీ ఈవీఎంలు వద్దు... బ్యాలెట్ ముద్దు... అంటూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఆదివారం కోట పట్టణంలో బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, క్రాస్‌రోడ్డులో ఓటర్లకు పోస్టుకార్డులు అందజేసి వారి మనోభావాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజా వ్యతిరేకతను ఉత్తరాల ద్వారా రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం బజారుసెంటర్‌లో ఈవీఎంలు వద్దు... బ్యాలెట్ ముద్దు... అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మట్టిగుంట సురేంద్రబాబు, ఎంబేటి వెంకటకృష్ణయ్య, చెన్నకేశవులు, శ్రీరామ్‌సురేష్, ఆటో యూనియన్ కార్యదర్శి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు సాంకేతికతపై అవగాహన



ఆక్వా రైతులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ ఆంజనేయులు

వాకాడు, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని అశోక్‌పిల్లర్ సమీపంలో ఉన్న బాలాజీ ఆక్వాఫీడ్, కెమికల్స్‌లో ఫిడోర సీఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆక్వా రైతులకు సాంకేతికతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ సైంటిస్ట్ ఆంజనేయులు మాట్లాడుతూ అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో శాస్త్రబద్ధంగా సమపాళ్ల పోషక విలువలు ఇవ్వడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆక్వా ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతిలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో ఫిడోర టీమ్ హరనాథ్‌రెడ్డి, నాగరాజు, బాలాజీ ఆక్వాఫీడ్స్ అధినేత బాలాజీ రైతులు పసుపులేటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలచ్చూరులో బీజేపీ ప్రజాపోరు యాత్ర

పెళ్లకూరు, ఫిబ్రవరి 25: మండలంలోని పాలచ్చూరు గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపోరుయాత్ర ఆదివారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు బీజేపీ కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ మురళి, నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహులు, గణేష్ పాల్గొన్నారు.

గూడలిలో..

కోట, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని గూడలి, ప్రకాశంకాలనీల్లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర జరిగింది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు ఆయా దళిత గిరిజన వాడల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగమ్మ, నిఖేష్ పరుశురాంసాయి పాల్గొన్నారు.

శతాబ్ది వేడుకల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

గూడూరు, ఫిబ్రవరి 25: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది వేడుకల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పాఠశాలను ప్రారంభించి గతేడాదితో వంద సంవత్సరాలు పూర్తి కావడంతో శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ఆదివారం ముగింపు వేడుకల సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కనుమూరు హరిచంద్రారెడ్డి, ఇందుకూరు శ్యాంప్రసాద్‌రెడ్డి, త్రివిక్రమరావు, శ్రీకంఠి రామమోహన్‌రావు, శ్రీధర్‌రెడ్డి, మనపాటి రవీంద్రబాబు, నీలిశెట్టి ఉమాశంకర్, దేవానంద్, కాంచన తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

గూడూరు, ఫిబ్రవరి 25: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రెండో పట్టణ సీఐ రవికిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు, హరికృష్ణ, సునీల్‌రాజ్, సింధూ తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఫిబ్రవరి 25: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి పండితులు చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఐక్యవేదిక ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 25: తిరుపతి పార్లమెంటు, వెంకటగిరి, గూడూరు అసెంబ్లీ నియోజకర్గాలకు ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఐక్యవేదిన కన్వీనర్ గద్దెల మునెయ్య మీడియాతో మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటుకు గద్దెల మునెయ్య, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా షేక్ రఫీ, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డొక్కా చిరంజీవిని ప్రకటించారు. కార్యక్రమంలో మునెయ్య, శీనయ్య, కృష్ణయ్య, బాబ్జి, కత్తి రాయుడు పాల్గొన్నారు.